ఓం నమో భగవతే శ్రీ రమణాయ



# రమణ భాస్కర



వ్యవస్థాపక సంపాదకులు : బి. వి. ఎల్. ఎన్. రాజు

సంపుటి : 26 | సంచిక : 4 | డిసెంబర్ 2020

రమణ భాస్కర
ఆధ్యాత్మిక మాస పత్రిక

పేజీలు : 32

గౌరవ సంపాదకులు
శ్రీమతి P. H. V. సత్యవతి (హైమ)

చందా
సంవత్సర చందా:రూ॥ 150/-
విడి ప్రతి : రూ॥ 15/-

చిరునామా
రమణ భాస్కర
శ్రీ రమణ క్షేత్రం,
జిన్నూరు – 534 265
ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్
సద్గురు శ్రీ నాన్నగారు
శ్రీ రమణ క్షేత్రం
జిన్నూరు – 534 265
9441122622
7780639977

ఈ సంచికలో....

22-12-1985, కాపవరం
అరుణాచల మహత్యం
శ్రీమద్భగవద్గీత

ప్రింటర్
శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్
(దుడే శ్రీను) ఎస్. వి. ఆర్. కాంప్లెక్స్,
పాలకొల్లు, 9848716747

ఓం శ్రీనాన్న పరమాత్మనే నమః

## సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు - 22 డిసెంబర్ 1985, కాపవరం

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

భగవద్గీత చెప్పి ఐదు వేల సంవత్సరాలు అయ్యింది. కృష్ణుడు కృష్ణుడుగా చెప్పలేదు, భగవంతుడిగా చెప్పాడు. అందుచేత ఇది కృష్ణ గీత కాదు భగవద్గీత. స్వయంగా భగవంతుని యొక్క ముఖంలో నుంచి వచ్చిన శాస్త్రం. భగవద్గీత గనుక మీరు చదివితే పుణ్యం వస్తుంది, చదివి అర్థం చేసుకుంటే మోక్షం వస్తుంది. గీత కంటే ముందు ప్రాచీనమైన గ్రంధాలు ఉన్నాయి కదా! కానీ ఈ పుస్తకానికి అంత పేరు రావటానికి గల కారణం ఏమిటి ? ఈ గీతలో మంత్రం ఉంది, తంత్రం ఉంది. దీని కీర్తి గొప్పది, విశ్వ గ్రంధం ఇది. యూనివర్సల్ ఇది. ఒక మత గ్రంధం కాదు, ఒక కుల గ్రంధం కాదు. ఒక శాఖా గ్రంధం కాదు. హిందువులైనా, క్రైస్తవులైనా, మహమ్మదీయులు అయినా, ఇందులో మాటలు అర్థం చేసుకుని ఆచరిస్తే, అనుభవంలోకి తెచ్చుకుంటే అందరికీ మోక్షం వస్తుంది. వాళ్ళు క్రైస్తవులు అవ్వచ్చు, హిందువులు అవ్వచ్చు, మహమ్మదీయులు అవ్వచ్చు, బ్రాహ్మణులు అవ్వచ్చు, రాజులు అవ్వచ్చు, వైశ్యులు అవ్వచ్చు. మతం తోటి కానీ, కులం తోటి కానీ, దేశం తోటి కానీ, సంబంధం లేనటువంటి గ్రంధరాజం. పండగలలో దీపావళి పండుగ ఎటువంటిదో, పుస్తకాలలో ఈ గీతా పుస్తకం అటువంటిది అని చెబుతారు. ఇందులో మంత్రం ఉంది, తంత్రం ఉంది. మంత్రం అంటే ఏమిటి? తంత్రం అంటే ఏమిటి? మంత్రం అంటే భక్తి మార్గం, తంత్రం అంటే కర్మ మార్గం. ఈ రెండు మార్గాలు కూడా భగవంతుడు

గీతలో ప్రతిపాదించాడు. మంత్రం అంటే ఉపాసనా మార్గం. ఏదోక రామ మంత్రమో, శివ మంత్రమో, దానిని మననం చేస్తే అది మనలని ఉద్ధరిస్తుంది. అది కూడా విద్యే. అది విద్య కాదు అనుకోకండి. అది కూడా విద్య తోటి సమానమే. గీతలో మొదటి ఆరు అధ్యాయాలు కర్మ గురించి, తరువాత ఆరు అధ్యాయాలు భక్తి గురించి, తరువాత ఆరు అధ్యాయాలు జ్ఞానం గురించి చెప్పాడు. చివరికొమ్మ జ్ఞానమార్గం. అంటే భక్తిమార్గాన్ని, కర్మమార్గాన్ని మనం త్రికరణ శుద్ధిగా ఆచరిస్తే, మనకి ఏమి వస్తుంది? జ్ఞానం వస్తుంది. చివరికొమ్మని అప్పుడు అందుకుంటాము. మనకి తలంపులు వస్తూ ఉంటాయి. అనేక మంచి మంచి తలంపులు వస్తూ ఉంటాయి, ఆలోచనలు వస్తూ ఉంటాయి, యాక్షన్‌కి వచ్చేటప్పటికి చెయ్యాలని ఉంటుంది కాని చాలా మంది ఫెయిల్ అవుతూ ఉంటారు, చెయ్యలేరు. ఉద్దేశం ఉంది అది మంచిదే కాని చెయ్యలేకపోతున్నారు. ఏదైతే నువ్వు మంచి అని అనుకుంటున్నావో అది చేసి చూపించాలి. చేసి చూపిస్తేనే నువ్వు పాస్ అయ్యినట్టు. గర్భం వచ్చిన తరువాత ఆ గర్భవిచ్ఛిత్తి ఎటువంటిదో, మనకి మంచి ఆలోచన వచ్చినప్పుడు దానిని ఆచరణలోకి పెట్టలేకపోవడం కూడా గర్భవిచ్ఛిత్తి లాంటిదే. అందుచేత భగవంతుడు ఏమి చెప్పాడు అంటే ఇందులో థియరీ పెట్టాడు, ప్రాక్టికల్ పెట్టాడు. భగవద్గీతలో ఏమి చేశాడు? నువ్వు ఏదో ఊహించుకోవడం కాదు. నువ్వు ఊహించుకున్నవి, నీతలంపులను, నువ్వు ప్రాక్టికల్‌గా చేసి పాస్ అవ్వాలి. నీ అంతట నువ్వు రుజువు చేసుకోవాలి. నీ అంతట నువ్వు రుజువు చేసుకోకపోతే అది గర్భవిచ్ఛిత్తి లాంటిదే, అందుచేత నీకున్న మంచి మంచి ఊహాలు అన్నింటిని కూడా నువ్వు ఆచరించగలగాలి. అలా ఆచరించేటప్పుడు కష్టాలు రావచ్చు, నష్టాలు రావచ్చు. బాధలు రావచ్చు. భారాలు రావచ్చు. అవన్నీ తట్టుకుని నువ్వు ప్రాక్టిస్ చెయ్యగలిగితే నువ్వు సక్సెస్ అవుతావు. నీ మనసులో ఏవో ఊహాలు ఉంటే కాదు, చేతితోటీ చెయ్యగలగాలి. ఒకటి థియరీ, రెండు ప్రాక్టికల్. ఒకటి మంత్రం, రెండు తంత్రం. ఇవి రెండు కూడా భగవద్గీతలో చక్కగా అప్లై చేసి చెప్పాడు. లోకమాన్య బాలగంగాధరతిలక్ అని, గాంధీగారి కంటే ముందు వాడు ఆయన, స్వాతంత్ర్య సమరం సమయంలో ఆయనను జైలులో పెట్టారు. ఆయనని ఆరు సంవత్సరాలు జైలులో పెడితే ఆయన గీతా వ్యాఖ్యానం రాశాడు. అందులో ఏమని రాశాడు అంటే, ఈ గీతకి వ్యాఖ్యానం రాశాను కాని, దాని లోతులు మటుకి నాకు తెలియలేదు అన్నాడు. శంకరాచార్యుల వారు జ్ఞానపరంగా రాస్తే, గాంధీగారు దానిని అనాసక్తిపరంగా రాస్తే, తిలక్ గారేమో కర్మ పరంగా రాశారు దానిని. రాయడం అంటే రాశాను గాని దాని అర్థం పూర్తిగా నేను చెప్పలేను అన్నారు తిలక్ గారు.

ఆంజనేయస్వామి సముద్రం దాటాడు కాని, దాని లోతు ఏమి తెలుస్తుంది ఆంజనేయస్వామికి అన్నాడు ఆయన. జ్ఞానికి అర్థం అవ్వాలి, లేకపోతే కృష్ణుడు అంతటి వాళ్లం అయితే ఆ మాటలకి అర్థాలు తెలుస్తాయి కాని, మామూలుగా కష్టమే! ఎందుచేత అంటే మన బుర్రలు ఖాళీ చెయ్యం. మన వాసనలు ఖాళీ చెయ్యం. మన సంస్కారాలు ఖాళీ చెయ్యం. అందుచేత గీత ఎన్ని సార్లు చదువుకున్నా, ఆ గీతలో ఉన్నది మనకి కనపడదు, మన వాసనలే కనిపిస్తాయి, మన గొడవలే గీతలో కనిపిస్తూ ఉంటాయి. అంటే మనకి ఏదైతే ఇష్టమో దానికి అనువుగా కృష్ణుడు చెబుతున్నాడు అని అనిపిస్తుంది. దీనికి అక్షరమణమాలలో భగవాన్ కూడా ఉదాహరణ చెప్పారు. **పొడిచే మయికపర్చి నా బోధ హరియించి నీ బోధ గనుపించి తరుణాచలా!** అంటే ఓ అరుణాచలేశ్వరుడా, నాకు ఈ శాస్త్రాల గొడవ లేకుండా, ఏమీ లేకుండా చేశావు? భగవద్గీత, బ్రహ్మసూత్రాలు అంటే మనం చెప్పుకున్నాం కాని, ఆయనకి ఏమీ తెలియదు. బడిలో పదవతరగతి చదువుకున్నాడు. అక్కడ నుంచి పరుగెట్టుకుని వచ్చాడు. నువ్వు ఏమి చేశావయ్యా? నా మీద మత్తు పొడి చల్లేశావు. నాకేం బాధ లేకుండా, నాకేం కష్టం లేకుండా, నన్ను ఎక్కడికి తీసుకెళ్తున్నావో కూడా నాకే తెలియనివ్వకుండా, నువ్వు ఏమి చేశావు? మత్తు పొడి చల్లావు. నాకు మత్తు ఎక్కించావు. నువ్వు నన్ను మైకంలో పెట్టేశావు. నేను మైకంలో పడిపోయాను. నాకు మత్తు ఎక్కించే వరకు నువ్వు మాట్లాడకుండా ఊరుకున్నావు. మత్తు ఎక్కేవరకు డాక్టరు గారు కత్తి చూపించరు. అలా నువ్వు వైద్యుడివి అయ్యా, శరీరానికి రోగాలు తగ్గించే మామూలు డాక్టరువు కాదు నువ్వు. ఈ సంసారంచక్రం నుండి విడుదలచేయటానికి ఆపరేషన్ చేసి అజ్ఞానాన్ని బయటకి తీసేసే డాక్టరువి. నువ్వు ఏమి చేశావ్, నన్ను చక్రంలో నుండి బయటకి తియ్యటం కోసం. ఈ ప్రకృతి లోనుండి బయటకి తియ్యటం కోసం. నా మీద మత్తు జల్లావు. మత్తు జల్లిన తరువాత మైకంలో పడిపోయాను నేను. అపుడు ఏమి చేశావు నువ్వు, నా భోగాన్ని హరించావు. అంటే నా తెలివి తేటలని తీసేశావు. ఇదేమిటండి? అంటే ఇప్పుడు మనం అందరం తెలివైన వాళ్ళమా? తెలివి తక్కువ వాళ్ళమా? అండి, ఇక్కడ అందరం కూర్చున్నాం, ఇందులో తెలివి తక్కువ వాళ్లం అని అనుకున్న వారు ఎవరైనా ఉన్నారా? మీకు తెలివితేటలు తక్కువ అంటే ఎవరైనా ఊరుకుంటారా? మొద్దబ్బాయి కూడా నీకు తెలివి తేటలు తక్కువ అంటే ఊరుకుంటాడా? ఊరుకోడు. యదార్థం చెప్పాలంటే మనం అందరం తెలివి తక్కువ వాళ్ళమే, కాని తెలివైన వాళ్ళమని అనుకొంటున్నాము. ఇదే మోసం. తెలివితేటలు లేకపోతే, లేనట్టు ఉంటే ఫరవాలేదు. తెలివి

తేటలు లేకపోయినా తెలివైన వాళ్లలా నటిస్తున్నాం. జీవుడికి తెలివితేటలు ఏమిటండి? అజ్ఞానానికి తెలివి ఏమిటి? ఈ జీవుడికి తెలివితేటలు ఉంటే, జ్ఞానం ఎందుకు రావడం లేదు? ఆత్మను ఎందుకు తెలుసుకోవడం లేదు? మరి కాలేజీలలోను, యూనివర్సిటీ లోను చదువుకున్న వారికి అందరికీ తెలివితేటలు ఉన్నాయి కదా, ఆ తెలివితేటల వల్ల వాళ్ళకి జ్ఞానం ఎందుకు కలగటం లేదు? ఎంత చదువుకున్నా అది ఈ లోకానికే పరిమితం, పొట్టకే పరిమితం. అందుచేత చదువుల్లో సారం కాదది. అందుచేత ఏమి చేశావు? నా తెలివితేటలు హరించావు. నేను తెలివైనవాడిని అనుకుంటున్నాను. నాకు తెలివితేటలు తక్కువ అయినా, తెలివిఉన్నవాడివలె అనుకుంటున్నాను. తెలివిలేనితనం తెలివిఉన్న దానిలా కనపడుతోంది అది మరీ ప్రమాదం. నాకు తెలివితేటలు లేవు అనుకుంటే, తెలివితేటలు సంపాదించడానికి ప్రయత్నం చేస్తాను. నాకు తెలివితేటలు ఉన్నాయి అనుకుంటే, ఎలా ప్రయత్నం చేస్తాను? నాకు డబ్బు లేదు అనుకుంటే డబ్బు సంపాదిస్తాను. నాకు డబ్బు లేకపోయినా డబ్బు ఉందని అనుకుంటున్నాను అనుకోండి నన్ను నేను మోసం చేసుకుంటున్నాను అన్నమాట. కొంతమంది ఇంటిదగ్గర బంగారం లేకపోయినా, బంగారం ఉన్నట్టు నటిస్తారు. డబ్బు లేకపోయినా, డబ్బు ఉన్నట్టు నటిస్తారు. బట్టలు లేకపోయినా బట్టలు ఉన్నట్టు నటిస్తారు. మేము గొప్పవాళ్ళం కాకపోయినా ఎదుటి వాళ్ళు చెప్పుకోవాలి. అంతే కదా! భగవంతుడు ఏమి చెబుతున్నాడు? మనం అందరం తెలివితేటలు లేవని అనుకుంటే ఇబ్బంది లేదు. తెలివితేటలు లేకపోయినా ఉన్నాయనుకుంటున్నాం. ఇదే ప్రమాదం. అందుచేత నువ్వు ఏమి చేశావు? నేను తెలివి గలవాడిని, నేను మేధావిని, నాకు బుర్ర ఉంది అనుకున్న భావనని ఏమి చేశావు? మత్తు మందు నా మీద చల్లి దాన్ని హరించావు. దానిని దొంగిలించావు. దానిని నాశనం చేశావు. నేను తెలివైనవాడిని, నేను గొప్పవాడిని, అనే భావనని తీసి ముందు అవతల పాడేశావు. నా భావనని దొంగిలించావు. ఇవన్నీ తీసేశావు నువ్వు. తీసేసి శుభ్రం చేశావు. ఇల్లు నీళ్ళు పెట్టి కడిగిన తరువాత కదా ముగ్గులు పెట్టడం. నీళ్ళు పెట్టి కడగకుండా, ముగ్గులు పెట్టరు. ముందు నీళ్ళు పెట్టి శుభ్రంగా కడిగాక, ఆఖరున ముగ్గులు పెడతారు. నా తెలివి తేటలు తీసేశావు. తీసేసి వదిలేసావా? అంటే నీ జ్ఞానాన్ని నాకు ఇచ్చావు. నా తెలివిని తీసేసి, నా అజ్ఞానాన్ని తీసేసి వదిలేశావా? వదిలేస్తే గాలిలో కలిసిపోతాను, ఎటూ కాకుండా అయిపోతాను. అలా చేసావా నువ్వు? కాదు. నా అజ్ఞానాన్ని తీసేసి ఊరుకున్నావా? నీ తెలివిని నాకు ఇచ్చావు. నీ ప్రకాశాన్ని నాకు ఇచ్చావు. నీ జ్ఞానాన్ని నాకు ఇచ్చావు. నీ ఆనందాన్ని నాకు ఇచ్చావు. నీ శాంతిని నాకు ఇచ్చావు. నా

అజ్ఞానాన్ని తీసేసి, నీ జ్ఞానాన్ని నాకు ఇచ్చావు. ఓ అరుణాచలేశ్వరుడా! ఇదంతా నాకు తెలియకుండానే చేసేశావు. అదే విధంగా ఇక్కడ భగవంతుడు ఏమి చెబుతున్నాడు అంటే, తన అహంకారాన్ని ఎవడైతే విడిచి పెడతాడో, ఎవడైతే త్రికరణశుద్ధిగా, ఎటువంటి mental reservations లేకుండా, ఎవడైతే గీతని చదువుతున్నాడో, వాడికే గీత అర్థం అవుతుంది. తలలో పెట్టుకున్న బూజు ముందు తీసేయాలి. మనకున్న భావాలని తీసుకెళ్ళి పక్కన పెట్టాలి. నేర్చుకోవాలి అనే కాంక్ష తోటే భగవద్గీత ఓపెన్ చెయ్యాలి. నేర్చుకోవాలి అనే తలంపు To know తెలుసుకోవాలి అనే కాంక్ష, మనం జ్ఞానం సంపాదించాలి అనే ఒక తపన హృదయంలోనుంచి రావాలి, నువ్వు ఏదో తెలివైనవాడివి అనుకునే భావన నువ్వు అట్టే పెట్టుకుంటే, గీతలో చెప్పిన మాటలు నీకు అర్థం కావు. అందుచేత నువ్వు అర్థం చేసుకో, అర్థం చేసుకుంటే ఆచరించగలవు. శ్రవణం చెయ్యి, మననం చెయ్యి. అది అర్థం చేసుకోగలవు. అర్థం ఎప్పుడైతే చేసుకున్నావో ఆచరించాలి అనే కోరిక నీకు అప్పుడే కలుగుతుంది అని భగవంతుడు వాసుదేవస్వామి వివరంగా చెబుతున్నాడు. మనం అందరం జీవులం, బిడ్డలం, ఎంతో ప్రేమగా, మనం అందరం బాగుపడాలి అనే లక్ష్యం తోటి ఈ శాస్త్రాన్ని ఇచ్చాడు. శంకరాచార్యుల వారు చెప్పారు కాశిలో ఉన్నటువంటి గంగ కొంచెం నోట్లో పోసుకున్నా, విష్ణుసహస్రనామాలు కొంచెం పారాయణ చేసినా, ఈ భగవద్గీత అంతా మీరు చదవలేక పోయినా ఒక్క శ్లోకం చదివినా మీ జీవితాలు తరించి పోతాయి అని చెప్పారు. ఎవడైతే రాగాన్ని విడిచి పెట్టాడో, ఎవడైతే భయాన్ని విడిచి పెట్టాడో, ఎవడైతే క్రోధాన్ని విడిచి పెట్టాడో, వాడి బుద్ధి మటుకే, వాడి జ్ఞానం మటుకే, వాడి ప్రజ్ఞ మటుకే స్థిరంగా ఉంటుంది. రాగమంటే ఏదైతే మనకి మంచి చెయ్యదో, దాన్ని మంచి అనుకోవడమే రాగం. మనకి మంచి చెయ్యని దానిని మంచి చేస్తుంది అని అనుకోవడమే రాగము. ఏ వస్తువైతే మనకి అపకారం చేస్తుందో, ఆ వస్తువుని చూసి మనకి ఉపకారం చేస్తుంది అనుకోవడమే రాగం. ఏ విషయాలైతే మనకి మోక్షాన్ని కలుగ జేయవో, ఆ విషయాలు మోక్షాన్ని కలుగ జేస్తాయి అనుకోవడమే రాగం. ఏదైతే మనకి కీడు చేస్తుందో, ఆ కీడు చేసే దానిని మనకి మేలు చేస్తుంది అనుకుంటే, అలా అనుకోవడమే రాగం. మన అందరికి రాగం ఉంది. రాగంలో ఉన్నంతకాలం, భయంలో ఉన్నంతకాలం, క్రోధంలో ఉన్నంతకాలం నీకు బుద్ధి స్థిరంగా ఉండదు అయ్యా. ఎవడికైతే రాగం ఉందో, ఎవడికైతే భయం ఉందో, ఎవడికైతే కోపం ఉందో, వాడు తాత్కాలికంగా శాంతిగా ఉన్నప్పటికీ వాడి బుద్ధి ఎన్నడూ స్థిరంగా ఉండదు అంటున్నాడు పరమాత్మ.

**యస్సర్వత్రా నభిస్నేహస్తత్తత్ప్రాప్య శుభాశుభమ్**
**నాభినన్దతి నద్వేష్టి తస్య ప్రజ్ఞా ప్రతిష్ఠితా**

నువ్వు ఆసక్తి పెట్టుకోకు. సర్వత్రా వస్తువుల పట్ల కాని, వ్యక్తుల పట్ల కాని, పరిసరాల పట్ల కాని, ఇష్టా ఇష్టాలు పెట్టుకోవద్దు. జగత్తులో కనిపించే ఏ వస్తువు మీదకాని, వ్యక్తి మీద కాని ఆసక్తి పెట్టుకోకు. పని బంధించదు మనలని ఆసక్తి బంధిస్తుంది. సర్వత్రా అంటే ఎదుటి వ్యక్తి మీదే కాదు, ఎదుటి వస్తువుల మీదే కాదు, ఎదుటి పరిసరాల మీదే కాదు, నీ శరీరం మీద, నీ మనస్సు మీద, నీ ప్రాణం మీద కూడా నువ్వు ఆసక్తి పెట్టుకోకు. నీ శరీరం మీద ఆసక్తి పెట్టుకుంటే నీకు భయం కలుగుతుంది. సర్వత్రా అనభిస్నేహ నీ శరీరం మీదకాని, నీ ప్రాణం మీదకాని ఆసక్తి పెట్టుకోవద్దు. అభిమానం పెట్టుకోవద్దు. నీ శరీరం మీద అభిమానం పెట్టుకున్నావు కాబట్టే, నీకు మరణం అంటే భయం వేస్తుంది. శరీరం నువ్వు కాదు అందుచేత అభిమానం పెట్టుకోకు అని భగవంతుడు వాసుదేవస్వామి చెబుతున్నాడు.

**స్తత్తత్ప్రాప్య శుభాశుభమ్** నీ జీవిత ప్రయాణంలో, జన్మించిన తరువాత మరణించే లోపల నీకు శుభం రావచ్చు, అశుభం రావచ్చు. శుభం అంటే మంచి, అశుభం అంటే చెడ్డ. మనకి మంచి వచ్చినప్పుడు శుభం అనుకుంటాం. ఆ మంచి జారిపోయినప్పుడు అశుభం అనుకుంటాం. అంతే కదా! అవేమీ లెక్కపెట్టుకోకు, నీ మనసుని దానిమీద పెట్టుకోకు, నీ దేహప్రారబ్ధాన్ని బట్టి నువ్వు ఏ తల్లి కడుపులో పుట్టాలో, ఏ గ్రామంలో ఉండాలో, ఏ రోజు నువ్వు మరణించాలో, నీ జీవితం ఎలా నడవాలో, కష్టాలు రావాలో, నష్టాలు రావాలో, అదృష్టమే రావాలో, దురదృష్టమే రావాలో, నీ పూర్వజన్మ సంచితాన్ని బట్టి, నీ ప్రారబ్ధాన్ని బట్టి నువ్వు చేసిన కర్మ వెంటాడుతూ ఉంటుంది. మనిషిని నీడ లాగా నీ ప్రారబ్ధం నిన్ను వెంటాడుతూ ఉంటుంది. నువ్వు అనుకున్నా, అనుకోకపోయినా, నీకు శుభం వస్తుంది. అశుభం వస్తుంది. అనుకోవడంతో సంబంధం లేదు. నీ కోరికతోటి సంబంధం లేకుండా, నీ ప్రయత్నం తోటి సంబంధం లేకుండా, నీకు అదృష్టం వస్తుంది, దురదృష్టం వస్తూ ఉంటుంది, శుభం వస్తూ ఉంటుంది. అశుభం వస్తూ ఉంటుంది. శుభం వెళ్ళిన తరువాత అశుభం, అశుభం తరువాత శుభం. రాత్రి తరువాత పగలు, పగలు తరువాత రాత్రి, ఇలా రాత్రి పగలు లాగా అవి తిరుగుతూ ఉంటాయి. అందుచేత వాటి మీద మనసు పెట్టుకోకు, ఆధ్యాత్మికంగా ఎంత అభివృద్ధి పొందుతున్నాం. ఎంతవరకు లోపలకి దిగగలుగుతున్నాం. ఎంతవరకు భగవంతుని వైపు ప్రయాణం చేయగలుగుతున్నాం అని నీ దృష్టి దాని మీద

ఉంచు, నీ అదృష్టం మీద, నీ దురదృష్టం మీద నీ మనసుని పెట్టకు. ఇదీ అబద్ధమే, అదీ అబద్ధమే అని చెబుతున్నాడు. ఎందుచేత అంటే, మీకు ఏదైనా అదృష్టం వచ్చింది అనుకోండి అదీ చిరకాలం ఉండదు. మీకేమైనా దురదృష్టం వచ్చింది అనుకోండి అదీ చిరకాలం ఉండదు. నీ దేహప్రారబ్ధాన్ని బట్టి వస్తూ ఉంటాయి పోతూ ఉంటాయి. వాటిమీద నీ మనసు పెట్టుకోకు. అది కూడా స్వప్నం తోటి సమానమే. అందుచేత ఆధ్యాత్మిక అభివృద్ధి చూసుకో, ఇక్కడ నుంచి కాపవరంలో కారు ఎక్కి పాలకొల్లు వెళుతుంటే, కొంత రోడ్డు బాగుండవచ్చు, కొంత రోడ్డు గోతులతోటి ఉండచ్చు. కాని మన దృష్టి ఎక్కడ ఉంటుంది? పాలకొల్లు మీదే ఉంటుంది. అలా మన జీవిత ప్రయాణంలో కొన్ని రోజులు బాగుంటాయి. కొన్ని రోజులు బాగుండకపోవచ్చు. ఆ గొడవలు అన్నీ వదిలేయ్, దేహప్రారబ్ధాన్ని బట్టి వస్తూ ఉంటుందిలే. భగవంతుడిని తెలుసుకోవాలి, ఆత్మని సాక్షాత్కరించుకోవాలి, జ్ఞానాన్ని సంపాదించాలి అని నీ శక్తిని, నీ దృష్టిని దానిమీదే పెట్టవయ్యా. ఈ అదృష్టాలు, దురదృష్టాలు నిలబడేవి కావు. ధర్మ, అర్థ, కామ, మోక్షం - వీటిని పురుషార్థాలు అంటారు. సర్వ సాధారణంగా జనాలకి మొదటిది అంటే ఇష్టం లేదు చివరిది ఇష్టం లేదు మధ్యలో ఉన్న అర్థ, కామాలు ఇష్టం. అందరికి అర్థ, కామాలు అంటే ఇష్టమే. ధర్మం అంటే ఇష్టం లేదు. మోక్షం అంటే ఇష్టం లేదు. యదార్థం చెప్పాలంటే ఈ చివరిదే నిజమైనపురుషార్థం. ప్రధాన పురుషార్థం, పరమపురుషార్థం మోక్షం ఒక్కటే. ఆ మోక్షాన్ని పొందటం కోసం నీ మనసు ఎంతవరకు ప్రయాణం చెయ్యగలుగుతోంది? అది చూసుకో కాని నీకు శుభం వచ్చినప్పుడు పొంగిపోకు, అశుభం వచ్చినప్పుడు క్రుంగిపోకు. రెండూ వస్తే రానివ్వు. అదృష్టం వచ్చినప్పుడు సంతోషపడకు, దురదృష్టం వచ్చినప్పుడు ద్వేషం పెట్టుకోకు. అలా నువ్వు ఉండగలిగితే అప్పుడు నీ ప్రజ్ఞ, అప్పుడు నీ తెలివి తేటలు స్థిరంగా ఉంటాయి. అందుచేత అదృష్టం వచ్చిన రోజున ఒక రకంగా ఉండి, దురదృష్టం వచ్చిన రోజున ఒక రకంగా ఉంటే, నీ తెలివి తేటలు స్థిరంగా ఉండవు, నీ బుద్ధి స్థిరంగా ఉండదు. అలా రోజుకొక రకంగా నువ్వు అవతారాలు ఎత్తుతూ ఉంటే, నువ్వు నన్ను తెలుసుకోవడానికి ప్రయత్నం చెయ్యలేవు. భగవంతుడు నీ దృష్టిలో ఉండడు. అందుచేత శుభ అశుభాల మీద నీ మనసుని పెట్టకు అని చెబుతున్నాడు భగవంతుడు వాసుదేవస్వామి.

**యదా సంహరతే చాయం కూర్మో౽ఙ్గానీవ సర్వశః**
**యిన్ద్రియాణీన్ద్రియార్థేభ్యస్త స్యప్రజ్ఞా ప్రతిష్ఠితా**

మీరు ఎప్పుడైనా తాబేలుని చూడండి, ఏదైనా ప్రమాదం వస్తుంది అనేటప్పటికి అవి వాటి ఇంద్రియాలని కష్టపడి లాక్కోవు, తలని, కాళ్ళని, ఎంతో తేలిగ్గా, ఎంతో సూక్ష్మంగా, సునాయాసంగా, మృదువుగా లోపలకు లాగేసుకుంటుంది. ఎంత గొప్ప పోలిక చెబుతున్నారో చూడండి. తాబేలుకి భయం వేసినప్పుడు, ఎంత సుకుమారంగా, ఎంత మృదువుగా, ఎంత నేర్పుగా, ఎంత తేలికగా తన ఇంద్రియాలని లోపలికి లాక్కుంటుందో, అదే విధంగా ఏ స్థితప్రజ్ఞుడు, ఏ సాధకుడు, ఏ దైవభక్తుడు తన ఇంద్రియాలను విషయాల నుంచి లాక్కుంటున్నాడో, విషయాలలో తిరుగుతున్నటువంటి ఇంద్రియాలని అంత తేలికగా ఎవడైతే లాక్కుంటున్నాడో వాడి ప్రజ్ఞ, వాడి తెలివి, వాడి బుద్ధి, వాడి మాటలు మాత్రమే నిలకడగా ఉంటాయి అంటున్నాడు భగవంతుడు వాసుదేవస్వామి. మీరు చేస్తున్న పని కష్టంగా ఉంటే ఎక్కువ కాలం చెయ్యలేరు. తేలికగా ఉండాలి, సంతోషంగా ఉండాలి. ఇంద్రియాలు సాధారణంగా విషయాలను పట్టుకుని ఉంటాయి. ఇంద్రియాలను విషయాలు ఆకర్షిస్తూ ఉంటాయి. ఇంద్రియాలకి విషయాలే సర్వస్వం. మరణించేటప్పుడు కూడా విషయాల వైపుకే మనసు వెళుతూ ఉంటుంది. మన అందరికీ కళ్ళు ఉన్నాయి. మనం కళ్ళతోటి చూస్తున్నాం అనుకుంటున్నాం ఇది అబద్ధం. మనకి అలా అనిపిస్తుంది కళ్ళు చూస్తున్నాయి అనుకుంటున్నాం. కళ్ళు చూడవు, కళ్ళు ద్వారా మనసు చూస్తుంది. చెవులు ద్వారా మనసు వింటుంది. అందుచేత కొంతమంది కళ్ళు ఉండి చూడలేరు. చెవులుండి వినలేరు. భగవంతుడు చెబుతున్న మాటల మీద మీకు అభిలాష లేకపోతే, వాళ్ళ మనసులో ఆ వాసన లేకపోతే, ఆ శుభ సంస్కారం కనుక రాకపోతే, కొంతమంది కళ్ళుండి చూడలేరు, చెవులుండి వినలేరు. వాళ్ళకి కళ్ళు లేవా? కళ్ళు ఉన్నాయి. వాళ్ళకి చెవులు లేవా? చెవులు ఉన్నాయి. అయితే భగవంతుడు చెప్పిన మాటలు ఎందుకు చూడటం లేదు. ఎందుకు వినటం లేదు. అంటే మనస్సులో కాంక్షలు వేరేగా ఉన్నాయి. అక్కడ మనస్సు కనుక లేకపోతే కళ్ళు ఉన్నప్పటికీ చూడలేము. చెవులు ఉన్నప్పటికీ వినలేము. అందుచేత మనస్సు ప్రధానం. బాహ్య విషయాలు తెలుసుకున్నట్టుగానే మనస్సుని నువ్వు తెలుసుకో. మనస్సు బహిర్ముఖం అవుతూ ఉంటుంది, ఇంద్రియాల ద్వారా బయటకి వచ్చెయ్యటానికి చూస్తుంది. ఇంద్రియాలని, శరీరాన్ని మనస్సు ఉపయోగించుకుంటుంది. అంటే మనస్సు ప్రధానం. ఈ మనస్సు బాగుపడటం కోసమే, ఈ మనస్సు స్వచ్ఛం అవ్వడం కోసమే, ఈ మనస్సుకి స్వస్తత చేకూరడం కోసమే, భగవంతుని యొక్క నామాన్ని స్మరించమన్నారు. భగవంతుని యొక్క నామంతో మీ మనసుని నాన బెట్టాలి. మనసు బహిర్ముఖం అయ్యేకొలది మనం మాయలో

పడిపోతున్నాం. అజ్ఞానంలో పడిపోతున్నాం. చీకటి లోకాలలో పడిపోతాము. మనం మరణించిన తరువాత చీకటి లోకాలు అని కొన్ని లోకాలు ఉంటాయి. ఇంద్రియాలు గనుక విచ్చలవిడిగా ఉంటే, ఇంద్రియాలు గనుక కంట్రోల్ లో లేకపోతే, ఎవరికైతే ఇంద్రియాలు స్వాధీనంలోకి రావో వాడు మరణించిన తరువాత భగవంతుడు కాదు రిసీవ్ చేసుకునేది, చీకటి. చీకటి లోకాలలో ఈ జీవుడు ఉండవలసిందే. మనం ఇంటిదగ్గర ఒంటరిగా కూర్చున్నప్పుడు అబ్బా ఏమిటండి నాకు మనసు కుదురుగా లేదండి. నాకు మనస్సు శాంతిగా లేదండి. ఏమిటి ఈ మధ్య నాకు బాగోటం లేదండి అని అనుకుంటారా ఎప్పుడైనా మీరు? అనుకుంటారు. దానికి కారణం ఏమిటో మీకు తెలుసా? మీ ఇంద్రియాలే కారణం. ఎదుటి వాడి వల్ల నూటికి ముప్పై కష్టాలు మనకి వస్తుంటే, నూటికి డబ్బై కష్టాలు మన ఇంద్రియాల వల్లే మనకి వస్తున్నాయి. అది మర్చిపోకండి, నా మనస్సు కుదురుగా ఉండటం లేదు అని మీరు అనుకుంటున్నారు కాని మీ మనస్సు కుదురుగా లేకపోవడానికి కారణం మీ ఇంద్రియాలుఅన్న సంగతి మీకు తెలియటం లేదు. అదే మాయ. దేనివల్ల నా మనసుకు అశాంతిగా ఉంది, దేనివల్ల కుదురు లేకుండా ఉంది, దేనివల్ల తెలివి లేకుండా ఉంది, దేనివల్ల మంచి మంచి విషయాలు అన్నీ నాకు తట్టటం లేదు. ఎందుచేత ప్రశాంతంగా లేదు. అసలు నా ఇంద్రియాల వల్లే నా మనస్సు ఆ పరిస్థితిలో ఉంది అన్న సంగతి నాకే తెలియటం లేదు. ఇంక నేను ఎలా బాగుపడతాను? ముందు రోగ నిర్ధారణ అవ్వాలి కదా, అది ముఖ్యం. అందుచేత మనం ఎదుటి వాళ్ళ మీదకి గెంటద్దు. మనం అనుభవించవలసిన కర్మ ఏదైనా ఉంటే, మనం అనుభవించవలసిన ప్రారబ్దం ఏదైనా ఉంటే, ఈశ్వరుడు ఎదుటి వాడి చేత ఆ మాట అనిపిస్తాడు. వాడు ఎవడు అనటానికి? వాడిలో కూడా ఈశ్వరుడు ఉన్నాడు. ఒకొక్కసారి వాసన పోవటం కోసం ఎదుటి వాడి చేత అనిపిస్తాడు. నన్ను నేను శిక్షించుకోను. కాని ఎదుటి వాడు కఠినమైన మాటలు అంటే కొన్ని కొన్ని వాసనలు నాకు తెలియకుండా జారిపోతాయి. అందుచేత ఎదుటివాడు కూడా నా ప్రారబ్దాన్ని బట్టే సిద్ధం అవుతున్నాడు. దేశంలో అనేక కుటుంబాలు ఉన్నాయి. మీరు ఈ కుటుంబంలో జన్మించటం ఏమిటి? అంటే దేహప్రారబ్దాన్ని బట్టి ఎవరు ఏ కుటుంబంలో జన్మించాలో, ఎంత ప్రారబ్దం అనుభవించి ఆ శరీరం విడిచి పెట్టాలో, ఇదంతా ఒక ప్లాన్ ప్రకారంగా ఈశ్వరుడి యొక్క ప్రణాళిక ప్రకారం ఈ సృష్టి అంతా నడుస్తుంది. ఆత్మ అంటే మీరు సామాన్యం అనుకోకండి. ఆత్మ యొక్క శక్తి అనంతమైన శక్తి. ఆత్మ శక్తి ఈ ప్రపంచాన్ని తయారు చేస్తుంది. ఆత్మ శక్తి ఈ ప్రపంచాన్ని నడుపుతుంది. ఆత్మ శక్తి ఈ ప్రపంచాన్ని లయం చేసుకుంటుంది. ఆత్మని

తెలుసుకున్నారు అంటే మీరు ఎంత శక్తివంతులు అవుతారో అర్థం చేసుకోండి. ఎవరైనా ఒక పది అంతస్తులు మేడ కడితేనే మనం ఆశ్చర్య పోతాము. ఎవరైనా పెద్ద గుడి కడితే మనం ఆశ్చర్యపోతాము. ఆత్మ అలా కాదు మన కళ్ళకి కనిపిస్తున్న ఈ విశాలమైన ప్రపంచాన్ని సృష్టించింది. ఈ ప్రపంచాన్ని పరిపాలిస్తుంది. ఈ ప్రపంచాన్ని అంతా కూడా దానిలో లయం చేసుకుంటుంది. అటువంటి ఆత్మ నా హృదయంలో ఉంది. అటువంటి ఆత్మని గనుక తెలుసుకుంటే వాడికి ఎంత శాంతి కలుగుతుందో, ఎంత శక్తి కలుగుతుందో మీరు అర్థం చేసుకోండి. మన కుటుంబంలో అవ్వనివ్వండి, మన పరిసరాలలో అవ్వనివ్వండి, మన గ్రామాలలో అవ్వనివ్వండి, మన దేశంలో అవ్వనివ్వండి, ఆ కాలమాన పరిస్థితులు బట్టి, ఆ దేహం మీద ఏ ప్రారబ్దం అయితే అనుభవించవలసి ఉందో, ఆ ప్రారబ్దం జరిగి పోతూ ఉంటుంది. దీనిమీద నువ్వు మనసు పెట్టుకోవద్దు. సృష్టి అంటే కల్పించబడినది అని. దాని పేరులోనే మనకి తెలుస్తుంది. అందుచేత ఆత్మరూపంలో ఉన్న భగవంతుడిని తెలుసుకోవడానికి మీ టైము అంతా ఖర్చు పెట్టండి అని చెబుతున్నాడు భగవంతుడు వాసుదేవస్వామి. పని ఏమీ బంధించదు. దానిమీద ఆసక్తి లేకుండా ఉంటే మనం ఎంత పని చేసినా అది నిన్ను బంధించదు. ఆసక్తి పెట్టుకున్నావా బంధిస్తుంది. ఆసక్తి లేకుండా పని చేస్తే నీకు ఆరోగ్యం బాగుంటుంది. నీకు కర్మ చుట్టుకోదు. మరణించిన తరువాత ఉత్తమలోకాలు వస్తాయి. ఆసక్తి తోటి పని చేస్తే కొత్త వాసనలు వస్తాయి. ఆసక్తి లేకుండా పని చేస్తే పాత వాసనలు ఊడిపోతాయి. మనం ఏ పని చేసినా జ్ఞానం కోసమే చెయ్యాలి. పూర్వం ఒక ఆశ్రమంలో గురుపుగారు ఏమి చెప్పారు అంటే ఇక్కడ ఉన్నవారు అందరూ తలో పని చేసుకోండి అన్నారు. అందులో ఒక అతను ఏమి చేసాడు అంటే ఆశ్రమానికి వచ్చిన అరటిపళ్ళు, ఆశ్రమానికి వచ్చిన బత్తాయి కాయలు, ఆశ్రమానికి ఎవరైనా పాలబిళ్ళలు తెస్తే పాలబిళ్ళలు తినేవాడు. ఒకడి మీదే పని పెడితే పని అవ్వదు కాని నలుగురు ఉన్నప్పుడు నాలుగు పనులు చేసుకోవాలి. నువ్వు చూస్తే వచ్చిన పాలబిళ్ళలు తింటున్నావు, వచ్చిన బత్తాయి కాయలు తింటున్నావు. వచ్చిన అరటిపళ్ళు తింటున్నావు. పని చూస్తే మిగతావాళ్ళు అందరూ చేస్తున్నారు. నువ్వేమీ పని చెయ్యటం లేదు అని ఒకసారి గురువు గారు అతనికి చెప్పారు. అతను ఏ పని చేసే వాడు కాదు. అతను ఏమి చెప్పాడంటే అందరూ తలో పని చెయ్యాలి అని మీరే చెబుతున్నారు కదా, ఈ తినటం అనే పని నేను చేస్తున్నాను అన్నాడు. అందరూ తలో పని చెయ్యడం అంటే వచ్చిన సరుకులు అన్నీ ఆయనని తినేయమనా? దాని అర్థం. ఒక్కొక్కసారి భగవద్గీతలో చెప్పిన విషయాలు కూడా ఇలాగే

అర్థం చేసుకుంటారు. ఒక పండితుడు ఏమి అడిగాడు అంటే భగవంతుడు ఫలితం లేకుండా పని చెయ్యమన్నాడు కదండీ. ఫలితం ఉండాలి కదా, ఫలితం లేకుండా పని చెయ్యమనటం ఏమిటండి? అటువంటి శంకలు పెట్టుకుని అడుగుతూ ఉంటారు. భగవద్గీతలో మీకు ఎక్కడా కూడా ఫలితాన్ని ఇవ్వను అని భగవంతుడు చెప్పలేదు. ఫలితాన్ని మీరు దృష్టిలో పెట్టుకోవద్దు అని చెప్పాడు కాని, ఫలితం మీద ఆసక్తి పెట్టుకోవద్దు అని చెప్పాడు కాని, నేను నీకు ఫలితాన్ని ఇవ్వను అని ఏడువందల శ్లోకాలలో ఎక్కడా చెప్పలేదు. అంటే మీరు ఫలితం యందు ఆసక్తి లేకుండా పనిచేస్తే, మీకు ఏమవుతుంది అంటే ఫలితం వస్తుంది, మోక్షం వస్తుంది. ఫలితం మీద ఆసక్తి పెట్టుకుని చేస్తే మోక్షం రాదు ఫలితం ఒక్కటే వస్తుంది. భగవాన్ ఏమి చెబుతున్నారు అంటే ఈ శుభం ఏమిటయ్యా? అశుభం ఏమిటయ్యా? నువ్వు ఆత్మని ఒక్కటే చూడు. ఆత్మ యందే నువ్వు గురి పెట్టు, ఆత్మ యందే నువ్వు లక్ష్యం పెట్టు, ఆత్మనే నువ్వు కేంద్రంగా పెట్టుకో, ఇంక అటు ఇటు చూడకు. నీ శక్తిని అంతా దాని మీదే పెట్టు. ఉన్నది ఒక్కటే సత్యం. అదే ఆత్మ, అదే భగవంతుడు. ఆత్మనే దృష్టిలో పెట్టుకో, ఆత్మ గురించే శ్రవణం చెయ్యి. ఆత్మ గురించే మననం చెయ్యి. అలా చెయ్యగా చెయ్యగా ఆత్మ కోసమే తపిస్తున్నావు కాబట్టి అదే నువ్వు అయ్యిపోతావు. ఇంక దేని గురించి ఆలోచించకు కించిత్ కూడా ఆలోచించకు. అది భగవాన్ మార్గం. ఆత్మని పొందాలి కాబట్టి దానిని గురించే శ్రవణం చెయ్యి, దాన్నే లక్ష్యంగా పెట్టుకో, అది ఫస్ట్ క్లాస్ ప్రయాణం, విమాన ప్రయాణం అది.

**విషయా వినివర్తన్తే నిరాహారస్య దేహినః ।**
**రసవర్జం రసోప్యస్య పరం దృష్ట్వా నివర్తతే ॥**

లంకణాలు చేసే వారికి కూడా ఇంద్రియాలు అణిగిపోతాయి. చావుకి సిద్ధంగా ఉన్న వాడికి ఇంద్రియాలు ఏమైనా గొడవ చేస్తాయా? భగవంతుడు ఏమి అంటున్నాడు అంటే ఏవయ్యా నువ్వు కొన్ని రోజులు అన్నం మానేశావు అనుకో, నీ శరీరం శుష్కించి పోయింది అనుకో, మంచాన పడి ఉన్నావు అనుకో, అపుడు ఇంద్రియాలు ఏమీ కదలవు. ఇంద్రియాలు ఏమి మెదలవు. అయితే ఇంద్రియాలు జయించి నట్టేనా అంటున్నారు. కృష్ణుడు ఏమి చెబుతున్నాడు అంటే నువ్వు కొంతకాలం తిండి మానేస్తే, ఆహారం మానేస్తే, కళ్ళతో చూడటం మానేస్తే, నీ ఇంద్రియాలు అలా పడి ఉండవచ్చు. ఇంద్రియాలు నిన్ను క్షోభ పెట్టకపోవచ్చు, ఇంద్రియాలు ప్రకోపం పెట్టకపోవచ్చు, ఇంద్రియాలు వికారం పెట్టకపోవచ్చు,

ఇంద్రియాలు నీకు అశాంతి తీసుకురాకపోవచ్చు. అంత మాత్రం చేత నువ్వు ఇంద్రియాలని జయించి నట్టేనా? అంత మాత్రం చేత నువ్వు స్థితప్రజ్ఞుడివేనా? అంటే కాదు అయ్యా అంటున్నాడు భగవంతుడు వాసుదేవస్వామి. మీరు ఒక్కటే జ్ఞాపకం ఉంచుకోండి ఈ ఒక్క వాక్యం చాలు గీతాజయంతి రోజున ఒకటి భోగం, రెండు యోగం, ఇవి రెండు ఒక ఇంట్లో కాపురం ఉండవు. జ్ఞాపకం ఉంచుకోండి వీటికి రెండింటికి అసలు పడదు. తాత్కాలికంగా ఇవి రెండు కే ఇంట్లో కాపురం ఉన్నా ఎక్కువ కాలం ఉండలేవు. అందుచేత ఏమిటంటే నువ్వు భోగాన్ని జయించటం కోసం. అన్నం మానేసి, తిండి మానేసి, నీళ్ళు మానేసి, నువ్వు కేవలం శరీరాన్ని శుష్కింప చేసినప్పటికీ, అంత మాత్రాన నువ్వు ఇంద్రియాలను జయించిన వాడివి కాదు అయ్యా, అంతమాత్రం చేత నువ్వు ఇంద్రియాలు జయించాను అనుకోకు. అంతమాత్రాన నేను జ్ఞానిని అయిపోయాను అనుకుంటావు ఏమో, గదిలో కూర్చుని తలుపులు వేసేసుకుని కృష్ణా, రామా అనుకుంటే నీ మనస్సు నిర్మలంగా ఉండవచ్చు. అంతమాత్రం చేత నువ్వు ఇంద్రియాలను జయించాను అనుకుంటున్నావు ఏమో, అంతమాత్రం చేత నువ్వు ఇంద్రియాలను జయించలేవు, నిరాహారస్య దేహినః కొంత మంది అన్నం మానేసి, నీళ్ళు మానేసి, ఘోరమైన తపస్సు, కఠోరమైన తపస్సు, నిద్రలేకుండా తపస్సు చేసిన చరిత్రలు కూడా మనం పురాణాల్లో చదువుకున్నాం. కాని వాళ్లకి కూడా జ్ఞానం కలగకుండా రాలిపోయారు. విషయం గనుక మీకు అర్థం కాకపోతే, మొండితనం తోటి, మూర్ఖత్వం తోటి గనుక మీరు అన్నాలు మానేసి, నీళ్ళు మానేసి, తపస్సు చేస్తే అంత మాత్రం చేత మీరు భక్తులు అవుతారు కాని యోగం సిద్ధించదు అంటున్నాడు భగవంతుడు వాసుదేవస్వామి. విషయం నువ్వు అర్థం చేసుకో, దేహినః అంటే, ఎవడైతే దేహాన్ని ధరించాడో వాడు దేహి, అంటే వాడు జీవుడు. భగవాన్ ఏమన్నారు అంటే, జీవుడు ఎక్కడ ఉన్నాడు అయ్యా ? జీవుడు అనేవాడు అసలు లేనే లేడు. నీకున్న అవిద్యే, నీకున్న అజ్ఞానమే, నీకున్న తెలివి తక్కువ తనమే జీవుడిలా కనిపిస్తున్నాడు కాని జీవుడు ఎక్కడ ఉన్నాడు అయ్యా? వాడు కుందేటి కొమ్ము, కుందేలుకి కొమ్ము ఉంటుందా అండి అసలు. కుందేలుకి కొమ్ములే ఉండవు. జీవుడు అనేవాడు లేడు. లేడు కాని ఉన్నట్టుగా నీకు అనిపిస్తోంది. నువ్వు ఆత్మని దర్శించి, ఆత్మని తెలుసుకుంటే లేని జీవుడు లేనట్టుగానే నీకు తెలుస్తుంది. నీ అజ్ఞానం పోతే జీవుడు పోయినట్టే, నీకున్న అవిద్య పోతే జీవుడు పోయినట్టే, నీకున్న ప్రకృతిగుణాలు పోతే జీవుడు పోయినట్టే. జీవుడు అనేవాడు ఒక ముద్ద కాదు అదేమీ లేదు. ఊరికే ఉన్నట్టు కనిపిస్తుంది. లోపల నీకున్న అజ్ఞానాన్ని పోగొట్టుకో ఇంక జీవలక్షణాలు అన్నీ పోయినట్టే.

ఆ దేహంలోనే నువ్వు మోక్షాన్ని పొందుతావు అంటున్నాడు రమణస్వామి. అంటే మీరు మరణించే టప్పుడు కూడా, ఈ ఇంద్రియాలు అరిగి పోయినప్పుడు కూడా, ఈ ప్రకృతి వాసనలు పోయినవి అని మీరు అనుకోకండి. మీరేమో కంగారు పడి నేను చచ్చిపోతే బాగుండును, ఈ కాన్సర్ గోల పడలేకపోతున్నాను, ఈ కడుపు నొప్పి బాధ పడలేకపోతున్నాను. నాకు మరణం ఎప్పుడు వస్తుంది? అని కాంక్ష పడుతున్నప్పుడు కూడా, భగవంతుడు మీ హృదయంలోనే ఉన్నాడు కదా! ఆయన ఏమి చేస్తాడు అంటే... ఈ ఇంద్రియాల తోటి చేసిన పనులు అన్నీ, మీ కోరికలు, కాంక్షలు, వాసనలు అన్నింటిని బయటకి లాగి, మనసులో జాగ్రత్త పెట్టే వరకు ఆ ప్రాణాన్ని తీయడు ఈశ్వరుడు. అది ఈశ్వరుడి యొక్క నియమం. బంగారం తూచేవాడు ఎలా తూస్తాడో, అలా జాగ్రత్తగా తూసి, మీ మనస్సులో ఉహించిన ఊహలు, ఇంద్రియాల తోటి మీరు చేసిన పనులు ఒక్కొక్కటి, ఒక్కొక్కటి లాగి మనస్సులో విడిచిపెడతాడు. ఆ సంస్కారం, ఆ తలంపు మనసులో విడిచి పెట్టిన తరువాత, మళ్ళీభవిష్యత్ జన్మలో అనుభవింప చెయ్యటం కోసం ఆ జీవిలో అన్నీ జాగ్రత్త పెట్టిన తరువాత అప్పుడు ప్రాణాలు బయటకి లాగుతాడు. అప్పుడు అది శవం అవుతుంది దానిని తీసుకెళ్ళి స్మశానంలో కాలుస్తారు. ఇది నేను చెప్పటం లేదు, భగవంతుడు వాసుదేవస్వామి చెబుతున్నాడు.

**రసోఃప్యస్య పరం దృష్ట్వా నివర్తతే** అయితే ఇలా ఉండిపోవాల్సిందేనా? ఇలా జన్మ జన్మలు ఇలా కాలిపోవాల్సిందేనా? నాకు తరించే మార్గం లేదా? మేము ఏ జన్మకి ఆ జన్మ ఏవోక పనులు చేసుకుంటాం, పుణ్యం చేస్తాం, పాపం చేస్తాం, ఇంద్రియాలతోటి విషయాలను గ్రహిస్తాం. ఇవి మనసులో పెడతాను అంటున్నావు. మనసులో పెడితే ఏ జన్మకి ఆ జన్మ శరీరం ఉంటుంది కదా, మనస్సు ఉంటుంది కదా, ఇంద్రియాలు ఉంటాయి కదా, ప్రకృతి ఉంటుంది కదా, ఇంక నాకు తరించే ఉపాయం ఏమీ లేదా? ఓ వాసుదేవస్వామి అని నువ్వు అడగవచ్చు. ఈ చక్రంలో తిరగవలసిందేనా? ఈ చక్రం నుండి బయట పడటానికి అవకాశం లేదా? ఇంక మోక్షం లేదా? ముక్తి లేదా? ఈ జీవుడు తరించటానికి అవకాశం లేదా అంటే, ఎవడికైతే రసం పోతుందో, ఎవడికైతే వాసన పోతుందో, ఎవడికి కాంక్ష పోతుందో, పరం దృష్ట్వా ఎవరైతే మోక్ష మార్గాన్ని పొందారో, ఆత్మని ఎవరైతే దర్శించారో, ఆ కాంతిలో ఎవరైతే ప్రవేశించారో, ఆ శాంతిలో ఎవరైతే ప్రవేశించారో, ఆత్మ శక్తిని ఎవరైతే జీవించి ఉండగానే రుచి చూశారో, అప్పుడు ఒక్కసారిగా ఈ వాసనలు అన్నీ కాలిపోయి బూడిద అవుతాయి అంటున్నాడు భగవంతుడు వాసుదేవస్వామి. అంతవరకు ఈ చక్రంలో

కొట్టుకు పోవాల్సిందే అంటున్నాడు భగవంతుడు వాసుదేవస్వామి. నీ లోపల పరతత్త్వం ఒకటి ఉంది, దానిని పరమపదం అంటారు. దానిని ఆత్మ అంటారు. దానిని దైవ సామ్రాజ్యం అంటారు. దానిని నిర్వాణం అంటారు. దానిని మోక్షం అంటారు. ఈ శరీరం మరణిస్తుంది, మరణం లేని వస్తువు ఈ శరీరంలో ఒకటి ఉంది. దానిని అంటే ఆత్మని నువ్వు చూడగలిగావా నీలో వాసనలు అన్నీ కాలిపోతాయి. అదే నీకు చివరిజన్మ, అదే నీకు కడసారిజన్మ అంటున్నారు భగవంతుడు వాసుదేవస్వామి. భగవంతుడు చెప్పిన మాటలు నేను మీకు చెప్పవలసిందే కాని, అంతకంటే కల్పించి నేను మీకు చెప్పడానికి అవకాశం లేదు. మొత్తం మీద నీకు ప్రపంచవాసన, దేహవాసన, శాస్త్రవాసన ఆత్మను దర్శించే వరకు నిన్ను విడిచిపెట్టవు. మీరు రాజులా? బ్రాహ్మణులా? క్రైస్తవులా? హిందువులా? స్త్రీలా? పురుషులా? మీరు అమెరికాలో ఉన్నారా? ఇండియాలో ఉన్నారా? ఈ మాటలు అనవసరం. నీ మతం అనవసరం, నీ కులం అనవసరం, నీ జాతి అనవసరం, నీ గోత్రం అనవసరం, అదంతా అనవసరం. నువ్వు ఆత్మను దర్శించే వరకు, చైతన్య వస్తువును సాక్షాత్కరించుకునే వరకూ, నీలోని వాసనలు నిన్ను విడిచి పెట్టవు. ఎప్పుడైతే చైతన్యవస్తువును దర్శించావో అప్పుడు ఒక్కసారిగా వాసనలు అన్నీ పడిపోతాయి, ఆ సంస్కారాలు అన్నీ పడిపోతాయి. అంటే ఏ మతస్తుడు అయినా ఆత్మని, ఈ చైతన్యాన్ని అనుభవంలోకి తెచ్చుకోవాలి అంటున్నాడు భగవంతుడు వాసుదేవస్వామి.

స్మశానం తోటి మన జీవిత యాత్ర పూర్తి అయిపోతుంది అని మీరు ఎవరూ అనుకోవద్దు. మన దేహయాత్ర పూర్తి అవుతుంది. ఒక దేహంలో ఒక చుట్టాలు, స్నేహితులు ఉంటే మళ్ళీ కొత్త దేహం వచ్చేటప్పటికి కొత్త చుట్టాలు, కొత్త స్నేహితులు, కొత్త పరిసరాలు. ఈ సుబ్బారాయుడు సుబ్బరాయుడిలాగానే ఉంటాడు. రసవర్జంరసోప్యస్య ఏ జన్మలోకి వెళ్ళినా నీ వాసన నిన్ను విడిచి పెట్టదు. ఎప్పుడు వరకు విడిచి పెట్టదు? పరందృష్ట్వానివర్తతే నువ్వు ఆత్మని దర్శించే వరకు నిన్ను విడిచిపెట్టవు. సిద్ధి అంటే ఒకటే సిద్ధి మోక్షసిద్ధి. మిగతా సిద్ధులు అన్నీ, మిగతా మహిమలు అన్నీ స్వప్నంతో సమానం. ఒకే సిద్ధి ఉంది అదే మోక్ష సిద్ధి. మిగతా సిద్ధులు అన్నీ సిద్ధులు కావు అవి మాయ తోటి సమానం.

**యతతో హ్యపి కౌన్తేయ పురుషస్య విపశ్చితః ।**
**ఇంద్రియాణి ప్రమాథీని హరన్తి ప్రసభం మనః ॥**

ఇంద్రియాల గురించి చెపుతున్నాడు భగవంతుడు వాసుదేవస్వామి. భగవాన్‌కి ఇంద్రియాల గొడవ అక్కరలేదు, ఏదీ అక్కరలేదు ఆత్మ ఒక్కటే. వాటి గొడవ నీకెందుకురా,

ఆత్మని తెలుసుకోరా, ఆత్మని తెలుసుకుంటే ఇంద్రియాలు వాటంతట అవే పోతాయిరా అంటారు. భగవంతుడు ఏమంటున్నాడు అంటే ఎవడైతే తెలివి గలవాడో, ఎవడైతే బుద్ధి మంతుడో, ఎవడైతే మోక్షాన్ని పొందటం కోసం సాధన చేస్తున్నాడో, వాడి ఇంద్రియాలు కూడా వాడిని లాక్కెళ్ళిపోతున్నాయి. మాములు మొద్దు అబ్బాయి మాట ఎందుకు ఇంక? ఇంద్రియాణి ప్రమాథీని నీకు చాలా కష్టం తీసుకు వస్తాయి ఇంద్రియాలు. పేచీలు అన్నీ ఇంద్రియాల వల్లే, ఇవి చాలా బలం అయినవి. మనం సాధన చేస్తే, మనం చేసే సాధన కంటే బలమైనవి ఈ ఇంద్రియాలు. మనం ప్రయత్నం చేస్తుంటే మనం చేసే ప్రయత్నం కంటే బలమైనవి ఇంద్రియాలు. మనకి ఒక కోటి రూపాయలు అప్పు ఉంది అనుకోండి, ఒక పదివేల రూపాయలు సంపాదించాము అనుకోండి, పదివేల తోటి కోటి రూపాయల అప్పు తీర్చగలమా? పదివేల సంపాదన ఎక్కడ? కోటి రూపాయల అప్పు ఎక్కడ? అలాగే నువ్వు సాధన చేస్తున్నావు ఎంతో కొంత, నువ్వు సాధన చేస్తున్నప్పటికీ నీ సాధన కంటే ఇంద్రియాలకు బలం ఎక్కువ, సాధన కంటే నీ అహంకారానికి బలం ఎక్కువ ఉంది. అందుచేత బలవంతంగా నీ ఇంద్రియాలు నిన్ను లాక్కుపోతున్నాయి. ఈ ఇంద్రియాలను నిగ్రహించుకోవాలి అనుకుంటున్నావు. కాని బలవంతంగా నీ ఇంద్రియాలు నిన్ను లాక్కుపోతున్నాయి. నీ మనస్సు నిన్ను బయటకి లాక్కుపోతుంది. మీకు అర్థం అవుతోందా అండి సమస్య. మాములు వాళ్ళ మాట వదిలేయండి. లౌకికుల మాట వదిలేయండి. సాధకుడి యొక్క మనసును కూడా, మోక్షాన్ని పొందాలి అనే కుతూహలం గల భక్తుడి యొక్క మనసుని కూడా, ఈ ఇంద్రియాలు హరిస్తున్నాయి. మన ఇంద్రియాలు, మన మనసుని, మనకి ఇష్టం లేకుండానే, మనతో సంబంధం లేకుండానే బయటకి లాక్కుపోతున్నాయి. ఇంద్రియాలకి అంత శక్తి ఉంది. అందుచేత ఈ ఇంద్రియాల విషయంలో నువ్వు బహుజాగ్రత్తగా ఉండాలి.

**తాని సర్వాణి సంయమ్య యుక్త ఆసీత మత్పరః।**
**వశే హి యస్యేన్ద్రియాణి తస్య ప్రజ్ఞా ప్రతిష్ఠితా ॥**

బలమైన ఇంద్రియాలని ఎవడైతే స్వాధీనం చేసుకుంటున్నాడో, ఎవడైతే నన్నే గమ్యంగా పెట్టుకుంటున్నాడో, ఎవడైతే నన్నే పురుషార్థంగా పెట్టుకుంటున్నాడో, ఎవడైతే నన్నే లక్ష్యంగా పెట్టుకుంటున్నాడో, ఎవడైతే నన్నే పొందాలి అనుకుంటున్నాడో, ఎవడైతే మనసులో నిలకడగా ఉంటాడో, కుదురుగా ఉంటాడో, వాడికే ఇంద్రియాలు భయపడతాయి. మీ

మనసుని మీరు కంగారు పెట్టుకోకూడదు. మీరు నిలకడగా ఉండాలి, కుదురుగా ఉండాలి, బహుజాగ్రత్తగా ఉండాలి, గంటకు ఒక రకంగా తయారు అవ్వకుండా, కష్టం వచ్చినప్పుడు ఒకరకంగా, లాభం వచ్చినప్పుడు ఒకరకంగా ఉండకుండా, మీ మనసుని ఏకాగ్రంగా ఉంచుకోవాలి. మీ ఇంద్రియాలు మీకు స్వాధీనం అవ్వాలంటే, ముందు మీ మనసుకి కుదురు ఉండాలి. మీ మనసుకి కుదురు ఉండాలంటే నువ్వు ఏమి చెయ్యాలి అంటే నన్ను లక్ష్యంగా పెట్టుకోవాలి. మీరు బాగా ప్రశాంతంగా ఆలోచించండి. మన అందరికి భక్తి ఉంది కాని మన లక్ష్యం భగవంతుడా? విషయాలా? మనం భగవంతుని ప్రార్ధిస్తున్నాం అందులో డౌట్ లేదు. భగవంతుడిని ప్రార్ధించేటప్పుడు భగవంతుడే కావాలని కోరుకుంటున్నావా? లోకంలో విషయాలు కావాలి అని కోరుకుంటున్నావా? భగవంతుని పొందటం కోసమే కనుక నువ్వు పూజలు చేస్తే, మీ ఇంద్రియాలు మీ స్వాధీనంలోకి వస్తాయి. భగవంతుడికి పూజలు చేసినప్పటికీ, నీ లక్ష్యం గనుక లోకంలో గొడవలు అయితే మీ ఇంద్రియాలు మీ స్వాధీనంలోకి రావు, రావు, రావు. మీరు పూజ చెయ్యండి, జపం చెయ్యండి, నామం చెయ్యండి, తపస్సు చెయ్యండి, మీ పూజ యొక్క లక్ష్యం దేవుడు అవ్వాలి. మీ నామం యొక్క లక్ష్యం భగవంతుడు అవ్వాలి. మీ తపస్సు యొక్క లక్ష్యం భగవంతుడు అవ్వాలి. కానీ భగవంతుడిని నువ్వు లక్ష్యంగా పెట్టుకోలేదు. భగవంతుడిని ప్రార్దిస్తున్నాము. దేనికోసం ప్రార్దిస్తున్నాం? ఈ లోకంలో మనం అనుకున్న పనులు నెరవేరాలి అని, ఇందులో ఏమైనా అబద్దం ఉందా? మీరందరూ ఇంత శ్రద్ధగా కూర్చుంటే, మీరు భగవంతుని ప్రార్ధించటం లేదు అంటే ఇంతకంటే అన్యాయం ఉందా? భగవంతుడు చెప్పే పాయింట్ ఏమిటి? మీరు బాగా అర్ధం చేసుకోండి ఈ ఒక్క విషయం. ఎవరికి ఇంద్రియాలు స్వాధీనంలోకి వస్తాయి అంటే, నన్ను ప్రార్ధిస్తే నీకు ఇంద్రియాలు స్వాధీనంలోకి రావు, నాకుపూజ చేసినా నీకు ఇంద్రియాలు స్వాధీనంలోకి రావు, నా గురించి మీరు వ్రతాలు చేసినా మీకు ఇంద్రియాలు స్వాధీనంలోకి రావు, మీరు వ్రతం చేసేటప్పుడు భగవంతుడినే పొందాలి, నాకు భగవంతుడు తప్పించి ఏమీ అక్కరలేదు. మీరు పూజ చేసేటప్పుడు కూడా నాకు భగవంతుడు తప్పించి ఇంకేమీ అక్కరలేదు అని చేయాలి. మీరు జపం చేసేటప్పుడు కూడా భగవంతుడు తప్పించి నాకు ఏమి అక్కరలేదు. మీ మనస్సు నిండా భగవంతుడు ఆక్రమించుకోవాలి. మనం ఎప్పుడైతే తల్లి కడుపుని చీల్చుకుని బయటకి వచ్చామో, ఇది చాలా సీక్రెట్. మోహం ఏమి చేస్తుంది అంటే, మన ఇంద్రియాలని, మన బుద్దిని, మన మనస్సుని, బలవంతంగా వచ్చి ఆక్రమించేసుకుంటుంది. ఏవండి ఈ మోహం ఆక్రమించుకున్న తరువాత ఇంక స్మశానంలోకి

వెళ్ళే వరకూ అది పోదు. అయితే మీరు పోదు అంటున్నారు, మరి మా పూజలు మాట ఏమిటి? మా జపాలు మాట ఏమిటి? పదివేలు పెట్టి గుళ్ళు కట్టాం, సత్రాలు కట్టాం, మరి మేము ఏమి అయిపోవాలి అని అడిగితే, మీరు చాలా మంచి పనులు చేశారు. సత్యనారాయణ వ్రతాలు చేస్తున్నారు, జపాలు చేస్తున్నారు, గుళ్ళు కట్టారు, గోపురాలు కట్టారు, చెరువులు కూడా తవ్వించారు అయితే లోకం యొక్క వాసనలతోటి ఏ పని చేసినప్పటికీ, మంచిపనులు చేసినప్పటికీ అది మోహానికి సంబంధించినదే. ఇంక మోహం మిమ్మల్ని విడిచిపెట్టదు. రమణస్వామి చెప్పిన మాట ఏమిటంటే నువ్వు అసలు కోరిక అనేది లేకుండా ఉండటం మంచిది. ఒకవేళ కోరిక లేకుండా నువ్వు ఉండలేకపోతే మంచిని కోరుకో. నూటికి నూరు మార్కులు తెచ్చుకోండి మంచిది నూటికి నూరు మార్కులు రానప్పుడు నువ్వు ఆ పాస్ మార్కులు తెచ్చుకో, ఏమి చేస్తావు అంటున్నాడు. ఫస్ట్, సెకండ్, రెండు క్లాసులు చెబుతున్నాడు ఇక్కడ. అసలు కోరికలు లేని స్థితిలో, వాసనలు లేని స్థితిలో, కాంక్షలు, ఆకాంక్షలు లేని స్థితిలో ఉండటం మంచిది. అలా ఉండలేకపోతే మంచిని కోరుకో. అయితే నువ్వు మంచినీ దాటాలి, చెడునీ దాటాలి అంటున్నారు భగవాన్. జీవుడు తల్లి కడుపులోంచి బయటకి రాగానే మోహం ఏమి చేస్తుంది అంటే, వాడి మనస్సుని, వాడి ఇంద్రియాలని, వాడి బుద్ధిని ఆక్రమించుకుంటుంది. ఒక దేశం యొక్క రాజు ఇంకో దేశాన్నిఆక్రమించుకున్నట్టే, ఈ మోహం వచ్చి ఆక్రమించుకుంటుంది. అందుచేత మోహం యొక్క ప్రేరణ మీదే మనం ఈ పనులు చేస్తున్నాం. దాని వలన పుణ్యం రావచ్చు కాని, జ్ఞానం మటుకి రాదు, మోక్షం మటుకి రాదు. మోహంలో ఉన్న నీ బుద్ధిని నేను బయటకి తియ్యాలి అంటే, మోహంలో ఉన్న నీ ఇంద్రియాలని నేను బయటకి తియ్యాలి అంటే, మోహంలో ఉన్న నీ మనసుని నేను బయటకి తియ్యాలి అంటే, నన్ను లక్ష్యంగా పెట్టుకుని, నన్ను సాధనగా పెట్టుకుని నీ గురి నా యందు పెట్టుకుని నువ్వు అలా నిలకడగా, కుదురుగా ఉంటే, నీ బుద్ధిని మోహం నుండి విడిపిస్తాను, నీ ఇంద్రియాలని మోహం నుండి విడిపిస్తాను, నీ మనసుని మోహం నుండి విడిపిస్తాను, అప్పుడు నీకు జ్ఞానం కలుగుతుంది అంటున్నాడు భగవంతుడు వాసుదేవస్వామి. ఎంత ఉదాత్తంగా చెబుతున్నాడో, ఎంత అద్భుతంగా చెబుతున్నాడో, ఎంత అపూర్వంగా చెబుతున్నాడో వినండి. మీ మనసుకి పట్టించుకోండి భగవంతుడు చెప్పిన విషయాలు. అందుచేత మనం అందరం జ్ఞానం యొక్క ఆక్రమణలో లేము. మోహం యొక్క ఆక్రమణలో ఉన్నాము. మోహం మన బుద్ధిని ఆక్రమించింది, మన ఇంద్రియాలని ఆక్రమించింది, మన మనసుని ఆక్రమించింది. నువ్వు ఏమి చేస్తావంటే,

ఏడుస్తూ కూర్చుంటే లాభం లేదు. కాలం గడిచిపోతుంది. గతించిపోయిన రోజులు రమ్మంటే రావు, మన అందరినీ ఊరు పొమ్మంటుంది, స్మశానం రమ్మంటుంది. బాగా ముసలితనం వచ్చింది కాబట్టి, ఇంట్లో వాళ్ళు కూడా వీడు పోతే బాగుండును అనుకుంటారు. భార్య కూడా భర్త పోయిన తరువాత శవాన్ని చూడటానికి జడుస్తుంది. ఎంతో ప్రియంగా చూసినటువంటి ఆ దేహాన్ని, ఒక్కసారి ప్రాణం పోయిన తరువాత భార్యను చూడటానికి కూడా భర్తకు భయం వేస్తుంది. అది ఈశ్వరుని యొక్క లీల. అందుచేత మిమ్మల్ని అందరిని ఏది ఆక్రమించింది? మోహం ఆక్రమించింది. మీ బుద్ధిని అందులోంచి విడదీస్తాను. మీ మనస్సుని విడదీస్తాను. మీ అంతట మీరు విడదీసుకోలేరు. ఇంద్రియాలను బయటకి లాగుతాను నేను. బయటకి లాగి మీకు జ్ఞానాన్ని ప్రసాదిస్తాను. నన్ను లక్ష్యంగా పెట్టుకోండి. మీరు ఏమి చేస్తున్నారు? నాకు పూజ చేస్తున్నారు, నాకు జపం చేస్తున్నారు, నాకు నామం చేస్తున్నారు, నన్ను అలంకరిస్తున్నారు, అన్నీ బాగానే చేస్తున్నారు. కానీ మీ లక్ష్యం ఎవరు? లోకం. అలా కాదు. మీరు నాకు పూజ చెయ్యండి నన్ను లక్ష్యంగా పెట్టుకోండి. మీరు నాకు జపం చెయ్యండి, నన్ను లక్ష్యంగా పెట్టుకోండి. మీరు నా నామం చెయ్యండి నన్ను లక్ష్యంగా పెట్టుకోండి. నన్ను పొందటానికే మీరు ప్రయత్నం చెయ్యండి మిగతా గొడవలు మీరు పెట్టుకోకండి. అవి మీ దేహప్రారబ్దాన్ని బట్టి జరుగుతూ ఉంటాయి. నన్ను పొందటం కోసమే మీరు ఏ పనైనా చెయ్యండి. మీరు ఏ పని చేసినా, నుంచున్నా, కూర్చున్నా, నడుస్తున్నా ఏ తలంపు వచ్చినా కూడా నా కోసమే అర్పించు. నీ మనస్సుని, నీ దేహన్ని, నీ ఇంద్రియాలని, నీ ధనాన్ని, మొత్తం సమస్తం నా కోసమే అర్పించు. ఇది అంతా భగవంతుడి సొత్తే అనే భావన తోటి నువ్వు పని చెయ్యి. భగవంతుడినే లక్ష్యంగా పెట్టుకోవాలి. సాధన కూడా భగవంతుని కోసమే చెయ్యాలి. సర్వ కాల సర్వ అవస్తల యందు 24 గంటలు నిద్రావస్తలో కూడా, స్వప్నావస్తలో కూడా, జాగృదావస్థలో కూడా నన్నే పొందాలి అనే లక్ష్యాన్ని పెట్టుకుంటే మీరు. అప్పుడు ఏమి చేస్తాను అంటే, మీ ఇంద్రియాలని, మీ మనస్సుని, మీ బుద్ధిని, మోహంలో పడి కొట్టుకుంటున్నటువంటి మిమ్మల్ని నేను బయటకి విడదీస్తాను అయ్యా, అంతకంటే నీకు గత్యంతరం లేదు అంటున్నాడు భగవంతుడు వాసుదేవస్వామి. కాని మీరు ఆ పని చెయ్యరు అనుకోండి, ఆ పని చెయ్యకుండా శరీరం పడిపోతుంది అనుకోండి. శరీరం పడిపోయిన తరువాత మీ కోసం క్షుద్ర లోకాలు ఎదురు చూస్తాయి. నీచమైన లోకాలు, క్షుద్ర లోకాలు ఎదురు చూస్తాయి అట మన కోసం. సోదరమహాశయులారా, భగవంతుడిని తెలుసుకోకుండా కనుక ఈ శరీరం పడిపోతే మరణించిన తరువాత ఇరవై నాలుగు గంటలు

కూడా మనం చీకట్లో ఉండవలసిందే. వెలుగు మటుకి మన కళ్ళకి కనపడదు.

**తాని సర్వాణి సంయమ్య యుక్త ఆసీత మత్పరః** ఎవడు యుక్తుడు అంటే కుదురుగా ఉన్నవాడు యుక్తుడు, నిర్మలంగా ఉన్నవాడు యుక్తుడు. మీ బుద్ధి మీరు చెప్పినట్టు వింటే, మీ బుద్ధి మీ స్వాధీనంలో ఉంటే మీరు యుక్తులు. మీ బుద్ధి మీ స్వాధీనంలో లేకపోతే మీరు అయుక్తులు. ఎంతకాలం అలా నిద్రపోతావు? ఎన్ని జన్మలు అలా నిద్రపోతావు? ఎన్ని జన్మలు అలా అజ్ఞానంలో ఉంటావు? ఒకసారి నిద్రలోంచి బయటకి లెగు, ఒకసారి నడవటం ప్రారంభించు. భగవంతుడే నీ గమ్యం, భగవంతుడిని చేరే వరకూ, ఎవరు నిన్ను వెనక్కి పిలిచినప్పటికి, నీ వాసనలు నిన్ను వెనక్కి లాగుతున్నప్పటికి, నీ కోరికలు నిన్ను సమర్ధిస్తున్నప్పటికి, నీ గమ్యం మర్చిపోకు. నీ గమ్యం చేరేవరకు నీ ప్రయాణం ఆపకు. ఎంతకాలం అలా నిద్రపోతావు. ఎన్ని జన్మలు అలా తిరుగుతావు. ఓ మనస్సా నీ స్వస్థలానికి పొమ్ము అన్నాడు స్వామి వివేకానంద. ఎన్ని దేహాలను మోస్తావు ఎన్ని శవాలు మోస్తావు, ఎన్ని లోకాలు తిరుగుతావు. ఓ మనసా నీ స్వస్థానం ఎవరు? భగవంతుడు. నీ స్వస్థానమునకు పొమ్ము. ఇప్పుడు గంటకో రకంగా రోజుకో రకంగా మనం ఉంటున్నాం కదా, మన మనస్సే గనుక స్వస్థానంలో ఉంటే గంటకో రకంగా ఎందుకు ఉంటాం? అది స్వస్థానంలో లేదు. మనస్సు యొక్క స్వస్థానం భగవంతుడే, అక్కడకి చేరుకునేవరకు విశ్రాంతి లేదు. ఇలా శవాలు మోస్తూ ఉండవలసిందే. నీకు మానవ దేహం వచ్చింది మానవ దేహం వచ్చింది కాబట్టి ఇవాళ మీరు పూజలు చేస్తున్నారు. జపాలు చేస్తున్నారు. మనమే కనుక పాములాగా పుడితే దేవాలయానికి ఎక్కడికి వెళతాము అండి మనం ? మళ్ళీ అవకాశం మీకు రాదు. మానవ దేహం మీకు వస్తుంది అని గ్యారంటీ లేదు. ఉన్న పది రోజులు నువ్వు జాగ్రత్తగా ఉపయోగించుకో, నిన్ను తీసుకెళ్ళి మరణించిన తరువాత జంతువు శరీరంలో పెడితే, జంతువులకి ప్రార్ధన చేసే అవకాశం లేదు. జంతువుకి కూడా భక్తి ఉండచ్చు కాని రామా అని అనగలదా అండి, శివ అని అనగలదా, కృష్ణా అని అనగలదా, గోవు లక్ష్మికి ఎంతో భక్తి ఉంది కాని రమణ అని అనగలిగిందా? మానవజన్మలో నీకు అవకాశాలు ఉన్నాయి. తెలుసుకోవాలి అనే బుద్ధి నీకు ఇచ్చాడు భగవంతుడు. ఈ బుద్దిని ఇచ్చినందుకు ఆ బుద్దిని ఉపయోగించుకో అంటున్నాడు భగవంతుడు వాసుదేవస్వామి. ఏవండి, మీరు నాకు వాళ్ళు చుట్టాలు, వీళ్ళు చుట్టాలు అని చెప్పుకుంటున్నారు కాని భగవంతుడిని తోటి చుట్టరికం ఎందుకు కలుపుకోరు చెప్పండి? ఎంతసేపూ మాకు ఆ ఊర్లో చుట్టాలు ఉన్నారు, ఈ ఊర్లో చుట్టాలు ఉన్నారు, ఆ చుట్టాలు ఉన్నారు, ఈ చుట్టాలు

ఉన్నారు ఇదే గొడవ, మళ్ళీ ఆ చుట్టాలకి డబ్బులు ఉండాలండి. కానీ భగవంతుడితోటి చుట్టరికం పెట్టుకుందామే, భగవంతుడితో సంబంధం పెట్టుకుందామే, భగవంతుడితోటి బంధింప పడదామే అని మీరు ఎందుకు అనుకోరు? భగవంతుడిని స్మరించగా, స్మరించగా, భగవంతుడిని తలపెట్టగా, తలపెట్టగా, భగవంతుడి తోటి వేరుపడలేని సంబంధం మనకి ఏర్పడుతుంది. అదే భగవంతుడి తోటి మనకి ఉన్న బంధం. మనకి స్నేహితుడు భగవంతుడు, చుట్టం భగవంతుడు, తల్లి భగవంతుడు, తండ్రి భగవంతుడు. దేహానికి సంబంధించిన వారు చుట్టాలు, మనసుకి సంబంధించిన వారు స్నేహితులు. ఈ గొడవలోనే మీరు ఉంటున్నారు కాని భగవంతుడి తోటి సంబంధం ఏమైనా పెట్టుకుంటున్నారా అసలు? అందుచేత నన్ను స్మరించండి అయ్యా, నాతో చుట్టరికం పెట్టుకోండయ్యా, నన్ను తలపెట్టండయ్యా, నన్ను తలపెడుతుంటే నీకు ఏది మంచో అది నేను చేసి పెడతాను. మీ అంతట మీరు ఇంద్రియాలను జయించలేరు. మీ అంతట మీరు మీ అహంకారాన్ని జయించలేరు, నా మీద మీరు గురి పెట్టుకోండి, నన్ను ప్రేమించండి ఆ ప్రేమలో మీరు జీవించండి. భగవంతుడు ఇలా అడిగేస్తున్నాడు ఏంటండి? ఎవరైనా అలా అడుగుతారా? మనకి అర్థం అయ్యేలా చెప్పటం కోసం ఆయన సిగ్గు వదులుకున్నాడు. నన్ను ప్రేమించండి. ఆ ప్రేమలో మీరు జీవించండి. ఏ ప్రేమలో అంటే నా యందు ప్రేమలో, నన్ను పొందాలనే ప్రేమలో, నా కాంక్షలో మీరు జీవించండి. Live in love ప్రేమలో జీవించండి. ఆ ప్రేమలో మరణించండి అంటున్నాడు పరమాత్మ.

**ధ్యాయతో విషయాన్ పుంసః సంఙ్గస్తేషు పజాయతే।**
**సంఙ్గాత్సంజాయతే కామః కామాత్ర్కోధోభిజాయతే॥**
**క్రోధాద్భవతి సమ్మోహః సమ్మోహత్స్మృతి విభ్రమః।**
**స్మృతి భ్రంశాద్బుద్ధినాశో బుద్ధి నాశాత్ప్రణశ్యతి ॥**

ధ్యాయతో విషయాన్ పుంసః మనం భగవంతుడిని ధ్యానం చెయ్యటం లేదు. ఎవ్వరిని ధ్యానం చేస్తున్నాం? ప్రపంచంలో విషయాలు అన్నీ ధ్యానం చేస్తున్నాం. అక్కడనుంచి మన పతనం ప్రారంభం. బంతి కింద పడి దొర్లటం మొదలెట్టాక అది ఎంత దూరం వెళ్ళిపోతుందో మనం చెప్పలేం. మనిషి ఒక్కసారి పతనం అయ్యాక వాడు ఎంతవరకు పతనం అవుతాడో మనం చెప్పలేము. మనిషి ఒక్కసారి దిగజారిపోయాక వాడు ఎంత వరకు దిగజారిపోతాడో మనం చెప్పలేము. సంఙ్గస్తేషు పజాయతే భగవంతుణ్ణి కాదు మనం

ధ్యానం చేస్తోంది? ఎవరిని ధ్యానం చేస్తున్నాము? ప్రపంచంలో గొడవలు ధ్యానం చేస్తున్నాము. ధ్యాయతే విషయాన్ పుంసః ఎవడైతే విషయాలను ధ్యానం చేస్తున్నాడో వాడికి సంజ్గస్తేషు పజాయతే వాడికి ఆసక్తి కలుగుతుంది. భగవంతుడిని గనుక మీరు ధ్యానం చేస్తుంటే భగవంతుడి మీద ఆసక్తి కలుగుతుంది. గురువు మీద ధ్యానం చేస్తుంటే గురువు పట్ల ఆసక్తి కలుగుతుంది. మీరు చదువు మీద గనుక ధ్యానం చేస్తుంటే చదువు పట్ల ఆసక్తి కలుగుతుంది. లోకంలో విషయాల పట్ల మీరు ధ్యానం చేస్తుంటే వాటిని స్మరిస్తుంటే లోకం పట్ల, విషయాల పట్ల మీకు ఆసక్తి కలుగుతుంది. అందుచేత మీరు దేనిమీద ధ్యానం చేస్తున్నారు? లోకం మీద ధ్యానం చేసుకుంటున్నారు. మీ దేహం మీద ధ్యానం చేసుకుంటున్నారు. చాలామంది ఉద్దేశం ఏమిటంటే భయం ఏమిటంటే, దేహం పడిపోయిన తరువాత లోకం కనపడదు ఏమో అని, మరణం అంటే ఎందుకు భయం అంటే దేహం పోయిన తరువాత లోకం కనపడదు ఏమో అని, లోకం ఎక్కడికి వెళుతుంది, ఇక్కడే ఉంటుంది. మళ్ళీ చూస్తాం కంగారు పడకండి. ధ్యానం గొడవ చూసుకోండి. ధ్యాయతే విషయాన్ పుంసః విషయాలను ఎవరైతే ధ్యానం చేస్తున్నారో, ఎవరికైతే విషయాల మీద మనసు ఉందో, ఆ మనసుకే విషయాల మీద ఆసక్తి కలుగుతుంది. అటాచ్‌మెంట్ కలుగుతుంది. మీకు విషయాల మీద ఆసక్తి కలిగింది అంటే మీరు బంధంలో ఉన్నట్టే. నువ్వు ఎంతకాలం అయితే బంధంలో ఉన్నావో అంతకాలం నీకు ముక్తి లేదు. నీ చేతుల తోటి నీ కాళ్ళకి సంకెళ్ళు వేసినట్టే లోకంలోని విషయాలని స్మరిస్తూ ఉంటే. ఎవరైతే విషయాలను స్మరిస్తున్నాడో, ఎవరైతే విషయాలను ధ్యానం చేస్తున్నాడో, వాడికి ఏమి కలుగుతుంది? వాటి మీద ఆసక్తి కలుగుతుంది. ఆసక్తిలోంచి కామం కలుగుతుంది? అంటే కోరిక కలుగుతుంది. కామం అంటే మీరు సాధారణంగా స్త్రీ, పురుష సంబంధం అనుకోకండి. స్త్రీ, పురుష సంబంధం కూడా ఒక వాసనే. కామం అంటే ఏమిటండి? ఆశ. అంటే దాన్ని పొందాలి అనేటటువంటి కాంక్ష పుడుతుంది. ఆశ లోంచి కోపం వస్తుంది. కోపంలోంచి ఏమి వస్తుంది? మోహం వస్తుంది. మోహం లోంచి ఏమి పుడుతుంది? భ్రాంతి పుడుతుంది. భ్రాంతి వచ్చాక బుద్ధి నాశనం అవుతుంది. బుద్ధి నాశనం అయ్యాక మనిషి పూర్తిగా నాశనం అయిపోతాడు. ఇది అసలైన బంధం. నేను వేరు, లోకం వేరు అనేటువంటి బుద్ధి మనకి ఎంత కాలం ఉందో అంతకాలం ఆ మనిషిని ఆశ విడిచిపెట్టదు. తనకంటే లోకం వేరుగా కనిపిస్తున్నంత కాలం తనకంటే ప్రకృతి వేరుగా కనిపిస్తున్నంత కాలం ఆశను ఎవరూ తప్పించలేరు అని రమణమహర్షి అన్నారు.

**దైవమనుచు నిన్ను దరిచేరగా నన్నుపూర్ణ నాశ మొనర్చితరుణాచలా** నాలోని వేరుభావన, నాలోని ద్వైతభావన నాశనం చేశావు అరుణాచలా, ఇక నేను కోరుకోవడానికి ఏముంది ఈ సృష్టిలో, దైవమనుచు నిన్ను దరిచేరగా నువ్వు వేరు నేను వేరు అనే బుద్ధి తోటి నేను ఇక్కడకి వచ్చాను. నువ్వు వేరు లోకం వేరు అనే బుద్ధి తోటి ఇక్కడకి వచ్చాను. కాని నువ్వు ఆ బుద్ధిని తీసేశావు. ఆ బుద్ధిని నాశనం చేసేసావు. ఈ లోకంలో కాని, పర లోకంలో కాని ఇంక ఏముంది నేను కోరుకోటానికి? వేరుభావనని కత్తిరించావు అరుణాచలా! ఆ వేరుభావన ఉన్నంతకాలం కోరికలు తప్పవు. వేరుభావన ఉన్నంత కాలం కాంక్షలు తప్పవు. వేరుభావన పోయిన తరువాత కోరుకోవడానికి ఒక వస్తువు అంటూ ఏది ఉండదు తానే అంతటా కనిపిస్తాడు. ఆత్మే అంతటా కనిపిస్తుంది కాబట్టి ఇక వాడికి కోరుకోడానికి వాంఛ బయలుదేరదు. విషయం వేరుగా ఉన్నంత కాలం నీకు కోరుకోవాలని బుద్ధి పుడుతుంది. అపుడు కామం వస్తుంది. ఈ వస్తువును సంపాదించాలి. ఆ వస్తువును సంపాదించాలి అని ఆశ కలుగుతుంది. ఆశకు అంతులేదు. అందుకే అలగ్జాండర్ చక్రవర్తి అనేక రాజ్యాలు సంపాదించాడు సంపాదించిన తరువాత మరణించాడు. చివరికి అతను ఏమని చెప్పాడు అంటే, నన్ను గోతిలో పెట్టినప్పుడు నా చేతులు బయటకి పెట్టమన్నాడు. మిగతా శరీరం అంతా గోతిలో పెట్టమన్నాడు. ఎందుకు అంటే అలగ్జాండర్ చక్రవర్తి అంతటి వాడు, దేశాలని దేశాలని సంపాదించి వొట్టి చేతులతోటి బయటకు పోయాడు అని తెలియటం కోసం. కొంతమందికి ధనం అంటే ఆశ, కొంతమందికి త్యాగమే ధనం. ఎవడైతే త్యాగమే ధనంగా పెట్టుకున్నాడో వాడికి జ్ఞానం కలుగుతుంది. ఎవడైతే ఆశ ధనంగా పెట్టుకున్నాడో వాడికి మోహం కలుగుతుంది. మహాత్మాగాంధీగారు శరీరం విడిచిపెట్టినప్పుడు అతని మొత్తం ఆస్తులు అన్నీ కూడితే, ఎన్ని సార్లు కూడినా ఇరవై రూపాయలే వచ్చింది. గాంధీగారికి ధనం ఏమిటండి? త్యాగమే ధనం. భగవాన్ ఏమి అన్నారు అంటే నువ్వు ఆత్మను స్మరించవయ్యా, ఆత్మ కోసమే జీవించవయ్యా, ఆత్మను ధ్యానం చెయ్యవయ్యా, ఈ కోపం గొడవలు, ఈ కామం గొడవలు నీకు ఎందుకయ్యా, వాటంతట అవే రాలిపోతాయి అన్నారు భగవాన్ శ్రీ రమణమహర్షి. నీకు వేరుగా వస్తువు కనిపిస్తున్నంత కాలం నీకు ద్వైతబుద్ధి ఉన్నంత కాలం నీకు ఆశ పుడుతూనే ఉంటుంది. ఈ విషయాలను స్మరిస్తున్నంత కాలం నీకు ఆశ పుడుతూనే ఉంటుంది. అందుచేత నీకు తలంపు వచ్చిందంటే కాంక్ష తప్పనిసరిగా వస్తుంది. కామం లోంచి క్రోధం పుడుతుంది. అంటే ఏమిటి కోపం. నేను

ఆశ తోటి ఒక ప్రయత్నం చేస్తాను అనుకోండి, నేను ఏ వస్తువు కోసం అయితే ఆశతో ప్రయత్నం చేస్తున్నానో దానికి మీరు అడ్డు వస్తున్నారు అనుకోండి, మీ మీద కోపం వచ్చేస్తుంది. అది ఇక్కడ సీక్రెట్. కోపం లోంచి ఏమి వస్తుంది? మోహం వస్తుంది. మోహం అంటే ఏమిటి, మోహంలో ఎవడికైతే బుద్ధి పడిందో వాడికి నిజం అబద్దంగా కనిపిస్తుంది, అబద్దం నిజంగా కనిపిస్తూ ఉంటుంది. సత్యం అసత్యంలా కనిపిస్తుంది. అసత్యం సత్యంలా కనిపిస్తుంది. లోకం ఉంది అనిపిస్తుంది, భగవంతుడు లేడు అనిపిస్తుంది. నిజంగా భగవంతుడు ఉన్నాడు, లోకం లేదు. కానీ మనకి ఏమి అనిపిస్తుంది? లోకం ఉంది భగవంతుడు లేడు అనిపిస్తుంది. ఇదంతా మనకి అనిపిస్తుంది కాబట్టి మోహం ఉన్నట్టే. ప్రపంచం అంటే ఏమి లేదు నీకున్న వాంఛలే, నీకున్న కోరికలను తీర్చుకోవడం కోసమే, బయట ఆ రూపం ఏర్పడుతుంది. ప్రపంచం వేరుగా లేదు. నీ మనస్సే ప్రపంచంగా మారుతుంది. మనస్సు లేనప్పుడు దేవుడు లేడు. మనస్సు లేనప్పుడు శరీరం లేదు. మనస్సు లేనప్పుడు ప్రపంచం లేదు. మీరు గాఢనిద్రలో ఉన్నారు. గాఢనిద్రలో ఉన్నప్పుడు మీ మనస్సు లేదు. మీకు దేహం లేదు. మీకు దేవుడు లేడు. ఈ లోకం లేదు. మీ మనస్సే దేహంగా మారుతుంది. మీ మనస్సే లోకంగా మారుతుంది. మీ మనస్సే ఒక రూపం ఇస్తే అదే దేవుడిగా మారుతుంది. ఇదంతా మీ మనస్సు చేస్తుంది, అందుచేత మనస్సు ఉంటే అంతా ఉన్నట్లే, మనస్సుని జయిస్తే అంతా జయించినట్టే. నీవు జ్ఞానం సంపాదిస్తే, ఆత్మ వైభవం కనుక తెలిసి ఉంటే, మరణించే లోపులో ఆత్మ యొక్క సుఖం, ఆత్మ యొక్క శాంతి, ఆత్మ యొక్క వైభవం, ఒక్కసారి మీ మనసు గనుక చూడగలిగితే లోకం ఎంత నిస్సారం అయినదో, సంసారం ఎంత నిస్సారం అయినదో, మన దేహం ఎంత నిస్సారం అయినదో అప్పుడు తెలుస్తుంది. సంసారంలో సారం లేదు కాని సారం ఉందని మనం అనుకుంటున్నాం మన అహంకారం వల్ల. సంసారంలో సారం లేకపోయినప్పటికీ, సంసారంలో సారం ఉన్నట్టు మనకి కనిపిస్తోంది కాబట్టి, నీకు మోహం ఉన్నట్టే అంటున్నాడు భగవంతుడు వాసుదేవస్వామి. ఎవడికైతే జ్ఞానం కలిగిందో వాడు కురిడి కొబ్బరి కాయ అయిపోతాడు. కురిడి కొబ్బరికాయ చూడండి ఆరిపోయి విడిపోతుంది లోపల. మీకు జ్ఞానం కలిగితే అలా మీ దేహం ఉండగానే దేహంలోంచి విడిపోతారు, ఇంద్రియాల లోంచి విడిపోతారు, అహంకారం తోటి విడిపోతారు. శాశ్వతం అయిన శాంతిని పొందుతారు. అప్పుడు మీరు పని చేస్తున్నా, పని చెయ్యని వారి మల్లె ఉంటారు. పని చేస్తుంటారు గాని మీరు పని చేస్తున్నట్టు మీకు

అనిపించదు. ఆసక్తి ఉన్నప్పుడే పని బరువుగా కనిపిస్తుంది. ఆసక్తి లేకుండా పని చేస్తే, ఇంక ఆ పని బరువుగా ఉండదు. ఎవడికైతే మోహం కలిగిందో వాడికి ఏది చెయ్యాలో, ఏది చెయ్యకూడదో, ఏది ఆచరించాలో, ఏది ఆచరించకూడదో, దేన్ని స్మరించాలో, దేన్ని స్మరించకూడదో అన్న సంగతి మీకు మోహం ఉన్నంత కాలం తెలియదు అంటున్నాడు భగవంతుడు వాసుదేవస్వామి. మోహం లోంచి ఏమి వస్తుందండీ? స్మృతి విభ్రమః స్మృతి అంటే మీ జ్ఞాపక శక్తి తగ్గిపోతుంది అంటున్నాడు భగవంతుడు వాసుదేవస్వామి. ఎవరికైతే మోహం కలిగిందో, వాడి జ్ఞాపకశక్తి కూడా పోతుంది అంటున్నాడు. అయితే భగవంతుడు చెప్పింది అబద్ధమా? నిజమా? అయితే మీ అందరికి జ్ఞాపకశక్తి ఉందా? లేదా? ఏవండి మీకు ఎన్ని ఎకరాల పొలం ఉంది అంటే చెప్పగలరు కదా. మీకు ఎంత బంగారం ఉంది అంటే చెప్పలేరేంటండి మీరు? మర్చిపోతారా, ఇక్కడ వచ్చిందండి చిక్కు. మీరు చెప్పిన మాటలే మీరు కాదు అంటున్నారు. మీ నోటితోటి చెప్పిన మాటలు అబద్దాలు అని మాకు తెలిసిపోతున్నాయి. మోహం ఉన్న మనిషికి జ్ఞాపకశక్తి ఉండదు అని భగవంతుడు చెబుతున్నాడు. భగవంతుడు చెప్పిన మాటలని మీరు పాటలు పాడుతున్నారు. అబద్ధం అని ఇక్కడ తెలిసిపోతోంది కదా అని అడిగితే భగవంతుడు ఏమి చెబుతున్నాడు అంటే, జ్ఞాపకశక్తి పోతుంది అంటే మీ మనస్సు మాలిన్యంలో పడిపోతుంది. జ్ఞాపకశక్తి పోవడం అంటే మీ బుద్ధి బురదలో పడిపోతుంది. ఎప్పుడైతే నువ్వు మోహంలో పడ్డావో పాపం చేస్తావు. అంటే నీ అంతఃకరణానికి, నీ మనసుకి దోషం పట్టుకుంటుంది అంటున్నారు. ఓ అరుణాచలేశ్వరుడా, నేను నీ మోహంలో పడ్డాను. ఎందుకు పడ్డాను? నాకున్న మోహం తీసేస్తావని, నాకున్న దేహ మోహం, నాకున్న లోక మోహం తీసేస్తావని, నీ మోహంలో పడ్డాను. ఓ అరుణాచలేశ్వరుడా, నీ మోహంలో పడ్డాను కాబట్టి నా మోహం తీసెయ్, నీ మోహంలో పడటం కూడా మోహమే. నిన్ను స్మరించటం కూడా మోహమే. అయితే పడ్డాను. ఎందుకు పడ్డాను? లోకం యొక్క మోహం పోవటం కోసం నీ మోహంలో పడ్డాను. నీ మీద ఉన్న మోహాన్ని కూడా నువ్వే తియ్యాలి. గౌతమ బుద్ధుడు ఏమి చెప్పాడు అంటే మూడు పూటలా తినేవాడు రోగి, రెండు పూటలా తినేవాడు భోగి, ఒక పూటే తినేవాడు యోగి అన్నాడు, గౌతమ బుద్ధుడు అంటే అయన పద్ధతిలో ఆయన చెప్పాడు. మీ జీర్ణశక్తిని బట్టి మీరు తినాలి. మీరు టైముకి శుభ్రంగా తినండి. మీ మనసు దేవుడి మీద పెట్టుకోండి. మీరు అన్నాలు మానేసి అన్నాన్ని స్మరించడం కంటే అన్నం తిని దేవుణ్ణి స్మరించండి. స్మృతి విభ్రమః

స్మృతి భ్రంశా బుద్ధినాశోఎవడికైతే బుద్ధిలో దోషాలు కలిగినవో, బుద్ధి యొక్క దోషం ఎలా పోతుంది అంటే సత్ గ్రంథ పఠనం వల్ల, సత్ పురుషుల సహవాసం వల్ల, దేవుణ్ణి స్మరించటం వల్ల, పరోపకారం వల్ల, పుణ్య కార్యాలు చెయ్యటం వల్ల, సమాజాన్ని సేవించటం వల్ల, లోకంలో అందరూ సుఖంగా ఉండాలి ఎవరికీ దుఃఖం రాకూడదు, ఎవరికీ కష్టం రాకూడదు అని లోకం యొక్క క్షేమం కోరటం వల్ల, మహాత్ముల దర్శనం చెయ్యటం వల్ల, మహాత్ములకి సేవ చెయ్యటం వల్ల, భగవద్గీత, ఉపనిషత్తులు వంటి శాస్త్రాలు మీరు చదవటం వల్ల, మీకు చదవటం చేత కాకపోతే ఎవరైనా చదువుతుంటే వినటం వల్ల, మీ బుద్ధిలో ఉన్న దోషాలు పోతాయి. భగవద్గీతలో భగవంతుడు ఏమని చెప్పాడు అంటే, ఈ భగవద్గీత మీరు పఠించండి. మీరు పఠిస్తే మీకు పుణ్యమే. మీరు చదవడమే కాదు, ఎదుటి వారిని చదవమని ప్రోత్సాహం చెయ్యడం వల్ల కూడా మీకు పుణ్యం వస్తుంది అన్నారు గీతలో. గౌతమబుద్ధుడు ఒక మాట చెప్పాడు, నా శరీరం పడిపోయిన తరువాత నా మాటలు మీరు పదిమందికి చెప్పండి అని చెప్పాడు. లోకం మీద ఎంత ప్రేమో, ఎంత అనురాగమో చూడండి. ఒక శిష్యుడు ఏమని అడిగాడు అంటే, ఏవండీ మీ మాటలు అందరూ వింటారా? అందరికీ ఇష్టం ఉంటాయా? ఎందుకని మళ్ళీ ఈ పని అప్పచెప్పారు మాకు? మీ మాటలు మేము చెబితే వాళ్ళు తిడితే, మమ్మల్ని ఏమి చెయ్యమంటారు అని అడిగాడు. అప్పుడు గౌతమబుద్ధుడు ఏమన్నాడంటే కొట్టలేనందుకు సంతోషించమన్నాడట. కొడతారు అనుకోండి అప్పుడు ఏమి చెయ్యమంటారు అంటే, చంపలేదు అని సంతోషించమన్నాడు. ఒకవేళ చంపేస్తే ఏమిటి అన్నాడు? ఈ శాస్త్రాన్ని ఎదుటి వాడికి చెబుతున్న ప్రయత్నంలో నువ్వు మరణిస్తే నీకు మోక్షం వస్తుంది అన్నాడు. సోదరమహాశయులారా, ప్రతీ మనిషికి అపజయం అనేది తప్పదు. మరణం అనేది తప్పదు. ప్రతీ మనిషి నేను జయం పొందాను, నేను జయంపొందాను అని అనుకుంటాడు కానీ, జయం వెనకాల అపజయం ఉంటుంది. సుఖం వెనకాల కష్టం ఉంటుంది. లాభం వెనకాల నష్టం ఉంటుంది. ఎప్పుడైతే నేను జయం పొందాను అనుకుంటున్నాడో, వాడికి తప్పనిసరిగా అపజయం వస్తుంది. అపజయం అనేది ప్రతీ మనిషికి ఉంది. ఈ ప్రకృతిలో తప్పదు అయితే వాయిదా పడవచ్చు. సాధువు అంటే ఎర్ర బట్టలు కట్టుకున్నవాడు సాధువు కాదు ఎవడికైతే క్షమించే స్వభావం ఉందో, వాడే సాధువు. ఎవరైనా చిన్న మాట అంటే మనం సహించలేము. సహించటం ఎప్పుడైతే నేర్చుకున్నావో, ఓపికగా ఉండటం ఎప్పుడైతే నేర్చుకున్నావో, ఓర్పు నుంచి నేర్పు పుడుతుంది. ఎప్పుడైతే ఓర్పుగా ఉన్నావో, అప్పుడు నీ మనస్సు అంతర్ముఖం అవుతుంది. అంతర్ముఖం అంటే ఏమిటి?

ఆత్మ వైపుకి ప్రయాణం చెయ్యటం. భగవంతుని వైపుకి ప్రయాణం చెయ్యటం. శరీరంలో రోగాలు అన్నీ స్మశానంలో కాలిపోతాయి. డాక్టర్లు తగ్గించలేరేమో కాని పుల్లలు తగ్గించేస్తాయి. భౌతికమైన అగ్ని నీ శరీరంలోని రోగాలను కాలుస్తుంది కానీ, నీ బుద్ధిలో ఉన్న రోగాలను జ్ఞానాగ్ని కాల్చగలదు కానీ, పుల్లల అగ్ని కాల్చలేదు. గడ్డిమేటు ఎంత పెద్దది అయినా, ఒక్క అగ్గిపుల్లతో కాలిపోతుంది. అదే విధంగా నీలో ఎన్ని దోషాలు ఉన్నప్పటికీ, ఎన్ని పాపాలు ఉన్నప్పటికి, ఎన్ని లోపాలు ఉన్నప్పటికి, నీ బుద్ధిలో ఎన్ని రోగాలు ఉన్నప్పటికి, జ్ఞానం అనే ఒక అగ్ని కణం. జ్ఞానం అనే నిప్పు, జ్ఞానం అనే రవ్వ ఒక్క సారి నీ బుద్దిలో పడిందా, బుద్ధిలో ఉన్న దోషాలు అన్నింటిని కాల్చి బూడిద చేస్తుంది అంటున్నాడు భగవంతుడు వాసుదేవస్వామి. మీరు శ్రవణం చెయ్యాలి, మననం చెయ్యాలి. మననంచెయ్యగా, చెయ్యగా అగ్ని పుడుతుంది. భౌతికమైన అగ్ని వేడిగా ఉంటుంది కానీ జ్ఞానాగ్ని వేడిగా ఉండదు, చల్లదనాన్ని ఇస్తుంది. శాంతిగా ఉంటుంది. నీ మనస్సు నీ ఇంద్రియాలు నీ బుద్ధి శాంతిలో కూరుకుపోతాయి. ఆనందంలో కూరుకు పోతాయి. మీరు ఆనందసామ్రాజ్యానికి చక్రవర్తి అవుతారు. దీనికోసం మీ ఊరు విడిచి పెట్టనక్కరలేదు, మీ భర్తని విడిచి పెట్టనక్కరలేదు. మీ పిల్లల్ని విడిచి పెట్టనక్కరలేదు. మీ సంసారాన్ని జాగ్రత్తగా చూసుకుంటూ మిగతా కాలం అంతా కూడా భగవంతుడిని తెలుసుకోవడం కోసం మీరు ప్రయత్నం చేయండి. మీ కాలాన్ని కూడా జాగ్రత్తగా వాడుకుంటూ, భగవంతుడిని స్మరిస్తూ, మంచి పనులు చేస్తూ, మంచిని స్మరిస్తూ మీరు కాలాన్ని గడుపుకోండి అంటున్నాడు భగవంతుడు వాసుదేవస్వామి.

## రమణ భాస్కర చందాదారులకు విన్నపం

**రమణ భాస్కర శాశ్వత చందా (10 సం॥లకు) రు॥ 1200/-లు**. రమణ భాస్కర శాశ్వత చందాదారులుగా చేరి పత్రికను ప్రోత్సహించవలసినదిగా కోరుచున్నాము.

**సంవత్సర చందా రు॥ 150/-లు**. సంవత్సర చందాదారులకు చందా గడువు ముగిసినది. మీ చందాను స్వయంగా గానీ లేక **శ్రీ రమణక్షేత్రం, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా**, అకౌంట్ నెంబర్ **520101264185724 (IFSC Code : UBIN0916137)** నందు గాని చెల్లించగలరు. చందాను **బ్యాంక్ అకౌంట్‌లో జమచేసినవారు** జమచేసిన తేదీ, వారి అడ్రసును **9866715896** ఫోన్ నెంబరుకు తెలియపరచగలరు.

# ఏసు క్రీస్తు - కరుణామయుడు

లైట్ ఆఫ్ ది వరల్డ్ (ప్రపంచానికి వెలుగు) అన్నారు నాన్నగారు ఏసుక్రీస్తు ప్రస్తావన వచ్చిన ఒక సందర్భంలో. మనందరి జీవితాలలో వెలుగు నింపిన మన ప్రియతమ నాన్నగారు, ఎంతో కరుణతో దయతో ఏసు గురించి చెప్పిన కొన్ని మాటలు.

నీ శ్వాస పోయినా విశ్వాసం పోనీయకు అన్నాడు ఏసు. నీ శ్వాస పోతే పోనియ్యి, విశ్వాసం పోనీయకు. ఏసుక్రీస్తు దేవుని కుమారుడు అని రోజూ పాటలు పాడతారు భక్తులు. ఒకసారి పదిమంది కూర్చున్నారు ఆయన దగ్గర. ఏసుక్రీస్తుని దేవుని కుమారుడు అని పాటలు పాడుతున్నారు. ఇదంతా అబద్ధమే అని ఆయనకి తెలుసు. మరుసటి రోజున ఏసు వాళ్ళని ఒక నావ ఎక్కించి సముద్రంలోకి తీసుకెళ్ళాడు. లోపలికి తీసుకెళ్ళి కొంచెం గాలి వాన సృష్టించాడు. నిజంగా గాలివాన లేదు అక్కడ, ఆయనే సృష్టించాడు. ఏసుక్రీస్తు మాట మరచిపోయి, ఏసుక్రీస్తు దేవుని కుమారుడు అని చెప్పటం మరిచిపోయి, మమ్మల్ని ఒడ్డున పడెయ్యి బాబోయ్, మా బ్రతుకులు మమ్మల్ని బ్రతకనియ్యి, మాకు ఇంటి దగ్గర భార్యలు ఉన్నారు, ఈ గాలివాన మమ్మల్ని చంపేస్తోంది, మమ్మల్ని ఒడ్డుకి చేర్చు అని విపరీతమైన ఏడుపు మొదలుపెట్టారు. పడవ అటూ ఇటూ ఊగిపోతోంది గాలివానలో. ఇక మునిగిపోయే స్టేజికి వచ్చేసింది. ఆ పడవలో ఏసుక్రీస్తు దేవుని కుమారుడు అని చెప్పే పదిమందీ చావటానికి సిద్ధంగా ఉన్నారు. అప్పుడు ఆపుచేసాడు గాలి. ప్రశాంతంగా కళ్ళు మూసుకుని అన్నాడు - విశ్వాసహీనులారా! విశ్వాసం అంటే ఏమిటో తెలియదు మీకు. రోజూ ఏసు దేవుని కుమారుడు అని పాటలు పాడుతున్నారు. నిజంగా ఏసు దేవుని కుమారుడని మీరు నమ్ముతూ వుంటే ఈ గాలివాన వస్తే మీకు భయం ఎందుకు వస్తోంది? విశ్వాసహీనులారా! విశ్వాసం అంటే పాటలు, సంగీతం అనుకొంటున్నారా? కబురులు కాకరకాయలు అనుకొంటున్నారా? మీరు నిజంగా నేను దేవుని కుమారుడని నమ్మితే, ఈ గాలి వర్షానికి భయపడతారేమిటి? మీరు కపటులు, నటిస్తున్నారు! మన విశ్వాసం చాలా అల్పమైనది. భగవంతుడు మనకి ఇంకా పరీక్షలు పెట్టటం లేదు. పరీక్షలు పెడితే విశ్వాసం వెంటనే పోతుంది, ఎవరో తుకారాం లాంటివాళ్ళకి తప్ప.

మన కళ్ళు మన చెవులు మన నోరు మనకి ఉపకారం కంటే అపకారం ఎక్కువ చేస్తాయి. మనకి ఉన్న డబ్బు చదువు కూడా మనకి ఉపకారం కంటే అపకారం ఎక్కువ చేస్తాయి. ఏసు అన్నాడు, నీ కళ్ళు నీకు అపకారం చేస్తుంటే, నీ కళ్ళు పీకి అవతల పారేయి. ఎంతదూరం వెళ్ళాడో చూడండి. నీ కళ్ళు నీకు అపకారం చేస్తుంటే, నీ కళ్ళ వల్ల శాశ్వతంగా నరకంలోకి పోయేదానికంటే కళ్ళు లేకుండా జీవించటం మంచిది అన్నాడు ఏసుక్రీస్తు. ఏసుక్రీస్తుకి పరిచయమున్న వాడు ఒకడు కనిపించాడు. నన్ను వెంబడించు అన్నాడు

ఏసు అతనితో. ఆ వ్యక్తి ఏసుతో మా చుట్టం ఒకడు చనిపోయాడు, శవాన్ని వల్లకాటిలో మోసుకెళ్ళటానికి వెళ్ళాలి ఇప్పడు, మీరు రమ్మంటున్నారు కాబట్టి మీరు ఉన్న చోటికి రేపు వస్తాను అన్నాడు. చచ్చినవాడిని వల్లకాటిలోకి మోసుకెళ్ళటానికి చావటానికి సిద్ధంగా ఉన్న వాళ్ళు చాలామంది ఉన్నారు, నువ్వే వెళ్ళనక్కరలేదు. నీకు అమృతత్వం కావాలంటే నా కూడా రా, అది అక్కరలేదు, శవాన్ని మోయటమే నీకు ముఖ్యం అనుకుంటే నువ్వు వెళ్ళిపో అన్నాడు ఏసు. కానీ వాడు ఏసుక్రీస్తు కూడా వెళ్ళలేదు చుట్టాల దగ్గర గౌరవం పోతుందేమో అని. వాళ్ళు ఏమనుకుంటారో, వీళ్ళు ఏమనుకుంటారో, అని ఏసుక్రీస్తుని కూడా ధిక్కరించి వెళ్ళిపోయాడు. అంటే వాడు సమాజానికి బానిస అయిపోయాడు, వాడికి లోకవాసన పోలేదు.

ఏసుక్రీస్తు బైబిల్‌లో ఏమన్నాడంటే, రత్నాలని తీసుకెళ్ళి, బంగారపు ముద్దని తీసుకెళ్ళి పందుల ముందు పడేయకండి, ఆ రత్నం విలువ ఆ బంగారం విలువ పందులకి తెలియదు. పోనీ పక్కనుంచి నడిచి వెళ్ళిపోయినా పరవాలేదు, ఆ రత్నాన్ని బంగారాన్ని కాళ్ళతోటి భూమిలోకి తొక్కేసి మరీ వెళుతుంది. రత్నాలు, బంగారం పందుల ముందు పడేస్తే ప్రయోజనం లేదు, వాటి విలువ తెలియక తొక్కుకుంటూ వెళ్ళిపోతుంది. పందేకాదు మనకి కూడా తెలియనప్పడు అంతే అన్నాడు.

మనస్సు బాహ్యంగా వెళ్ళిపోవటానికి లోకంలో ఎన్నో ఆకర్షణలు ఉన్నాయి. యజ్ఞాలు ఉన్నాయి, యాగాలు ఉన్నాయి. గుళ్ళు, గోపురాలు ఉన్నాయి. సబ్జక్టుని విని అర్థం చేసుకోవటం కష్టం. పది బస్తాలు ఇసుక, పది బస్తాలు సిమెంటు కొనేస్తే గుడి కట్టేయవచ్చు. దాని వల్ల పుణ్యం వస్తుంది అనుకొంటున్నారు. పుణ్యం వస్తే సుఖరూపంలో పోతుంది. పాపం వస్తే అది దుఃఖరూపంలో పోతుంది. అదీ ఇదీ కూడా కాలప్రవాహంలో పోతుంది. కాలంతోటి సంబంధం లేకుండా, జన్మలతోటి సంబంధం లేకుండా, పుట్టుకలతోటి సంబంధం లేకుండా, శాశ్వతముగా మీరు ఏదిగా ఉన్నారో, దేని స్వరూపము సుఖమో, దేని స్వరూపము శాంతో, దేని స్వరూపము ఆనందమో, అక్కడికి తీసుకెళ్ళటానికి ఎవరైనా టీచ్ చేసినా మీరు ఇష్టపడరు. మీరూ మంచి వాళ్ళే కానీ దాని విలువ తెలియకపోవటం వల్ల అలా అయిపోయారు.

కొందరికి ఇల్లు ఉంటుంది, పొలం ఉంటుంది, ధనం ఉంటుంది, కానీ ఏదో కారణం వల్ల దుఃఖం వస్తుంది. ఏసుక్రీస్తు అన్నాడు మనుషులు ఇల్లు కట్టుకుంటారు, పక్షులు గూళ్ళు కట్టుకుంటాయి. నాకు ఇల్లూ లేదు, గూడూ లేదు కానీ శాంతిగానే ఉన్నాను అన్నాడు. నీడ లేదు అసలు ఏసుక్రీస్తుకి. కానీ ఇల్లు ఉన్నవాళ్ళకంటే గూడు ఉన్నవాళ్ళకంటే నేను ఎక్కువ శాంతిగా ఉన్నాను అన్నాడు ఏసు. ఏమీ లేకపోయినా శాంతి సముద్రంలో ఊగిసలాడుతున్నాడు ఏసు.

ఏసుక్రీస్తుని శిలువ వేసారు. ఆయన అన్నాడు, నేను శిలువ మోసానని అందరూ శిలువ మొయ్యనక్కరలేదు. కానీ దైవికంగా మీలో ఎవరైనా శిలువ మోయవలసి వస్తే, శాంతిగా సహనంగా చాలా ఇష్టంగా మొయ్యండి అన్నాడు. దాని అర్థం ఏమిటి అంటే కొందరు జీవితమంతా మంచివాళ్ళ మధ్యనే ఉండి, పుట్టింటిలో అత్తగారి ఇంటిలో కూడా సుఖపడతారు. కొంతమందికి పుట్టింటిలో అత్తగారి ఇంటిలో కూడా ఎవరివల్లా కూడా సుఖం ఉండదు. ఎటుతిరిగినా బూడిదే. ఇటువంటి కష్టాలు పడేవాళ్ళు శిలువ మొయ్యటంతో సమానం. ఇటువంటి పరిస్థితులలో మీరు ఉన్నప్పటికీ, కష్టాలు ఇబ్బందులు మీరు పడుతున్నప్పటికీ, నేను శిలువ ఎలా మోస్తున్నానో, అలా మీరు కూడా ఆ కష్టాలను మొయ్యండి అన్నాడు ఏసు.

సమాధానపరిచేవాళ్ళు ధన్యులు. కొంతమంది కలహప్రియులు ఎక్కడైనా పేచీలు వస్తే పెంచేస్తారు. కానీ కొంతమంది సమాధానపరుస్తారు. ఎక్కడైనా పేచీలు వస్తే పెంచేయకుండా, ఆ పేచీ ఎందుకు వచ్చిందో కారణం అర్థం చేసుకొని, ఆ పేచీలు తగ్గించే వాళ్ళు ధన్యులు. వాళ్ళు దేవుని చూస్తారు. హృదయశుద్ధి కలవారు ధన్యులు. మీరు బయట ఎలా ఉన్నారు? ఎలాంటి బట్టలు కట్టుకొంటున్నారు? ఏమి తింటున్నారు? మీకు బ్యాంకులో ఏముంది? ఇంటిలో ఏముంది? మీకు పాండిత్యం ఉందా? లేదా? అని మీకు మోక్షం ఇచ్చేటప్పుడు భగవంతుడు చూడడు. మీ హృదయాన్ని చూస్తాడు. హృదయశుద్ధి కలవారు ధన్యులు, వారు దేవుని చూసెదరు, మోక్షాన్ని పొందెదరు.

ఏసుని శిలువ వేయటానికి తీసుకొని వెళ్తుంటే కొంతమంది అమ్మలు వెనకాల వెళుతున్నారు. ఏసుని కొండ ఎక్కిస్తూ కొరడాలు పెట్టి కొడుతుంటే ఆ స్త్రీలు చూసి దుఃఖపడుతున్నారు. వెనక్కి తిరిగి చూడటానికి కూడా అవకాశం ఇవ్వకుండా దెబ్బలు కొట్టేస్తున్నారు. రక్తాలు కారుతున్నాయి. మన ప్రభువు మనల్ని విడిచిపెట్టి వెళ్ళిపోతున్నాడు అని ఏడుస్తున్నారు. ఆ ప్రేమ స్వరూపుడు, ఆ జ్ఞాన స్వరూపుడు ఒక్కసారి వెనక్కి తిరిగాడు. అమ్మల్లారా ఎందుకు నా కోసం ఏడుస్తారు? మీరు నా కూడా రావద్దు, మీ ఇంటికి వెళ్ళిపోండి. మీ సంసారాలని, మీ పిల్లలని జాగ్రత్తగా చూసుకోండి. నాకోసం ఏడవవద్దు. నా కోసం దుఃఖపడి మీ కాలాన్ని ఖర్చు పెట్టకండి అన్నాడు ఏసుక్రీస్తు. మీ హృదయంలో ఉన్న వెలుగుని చూడటానికి ప్రయత్నం చేయండి. నా కూడా రాకండి, నా కోసం ఏడవకండి. మీరు హృదయపరిశుద్ధులు అవ్వండి. ఈశ్వరుడికోసం తపించాలి, ఈశ్వరుడికోసం ఎవడైతే తపిస్తున్నాడో, వాడికే హృదయపరిశుద్ధి వచ్చేది. మీకు ఎప్పుడైనా కడుపునొప్పి వస్తే ఆ బాధ పడలేక కొన్ని నిమిషాలు గిలగిలా కొట్టుకుంటారు. అటువంటి బాధతోటి ఎప్పుడైనా ఈశ్వరుడి కోసం తపించారా? రోజుకి 24 గంటలు అయితే, ఎన్ని గంటలు మీరు భగవంతుడి కోసం జీవిస్తున్నారు? బాహ్యవస్తువులతోటి ఎలా అలంకరించుకొంటున్నారో, అలా ఈశ్వరుని

అనుగ్రహంతోటి అలంకరించుకోండి.


ఏసుక్రీస్తుకి నెత్తిమీద ముళ్ళకిరీటం పెట్టారు. విపరీతమైన సఫరింగ్ వస్తుంది ముళ్ళకిరీటం పెడితే. ప్రభువా! ఏమిటి ఇంత సఫరింగుకి గురి అవుతున్నాను? నన్ను ఈ పరిస్థితులలో పెట్టావు ఏమిటి? నీకు నేను కంప్లయింట్ చేస్తున్నాను, అది పొరపాటే. నువ్వు నేను వేరు అనుకొన్నప్పుడు నీకు కంప్లయింట్ చెప్పవచ్చు. నువ్వు నేను ఒకటే అయినప్పుడు ఎవరికి కంప్లయింట్ చేస్తాను? నన్ను ఈ సఫరింగ్‌లోనుంచి తప్పించమని ఎలా చెప్పటం? నేను పొరపాటు చేస్తున్నాను అన్నాడు. అంతే ఆ స్ట్రగుల్లో డ్యువాలిటీ పోయింది, అద్వైతానుభవం వచ్చింది. "ఐ అండ్ మై ఫాదర్ ఆర్ ఒన్" అది అద్వైతానుభవం. అక్కడ డ్యువాలిటీ లేదు.

లైట్ ఆఫ్ ది వరల్డ్! జీవితమంతా ఈ ప్రపంచానికి నేనే కాంతిని అని చెప్పినటువంటి ఏసు, తన దేహాన్ని, తన మనస్సుని, తన సర్వస్వాన్ని, ప్రపంచంలో జ్ఞానం కోసం అర్పించినటువంటి ఏసు, ఒక్క కన్నీటి చుక్క కూడా ఈ ప్రపంచం నుంచి ఆశించలేదు.

ఏసు అన్నాడు, నన్ను మీరు పరిశుద్ధుడు అని పిలవకండి. దేవుని కుమారుడు పరిశుద్ధుడు అని మీరు పిలవకండి. పుట్టినవాడు ఎవడూ పరిశుద్ధుడు కాదు. యెహోవా ఒక్కడే పరిశుద్ధుడు. వాడు పరలోకంలో ఉన్నాడు. వాడు ఒక్కడే పరిశుద్ధుడు. ఎవడైతే పుట్టలేదో వాడు ఒక్కడు మాత్రమే పరిశుద్ధుడు.

ఇవ్వాళ ఏసుక్రీస్తు దేవుడు ఏసుక్రీస్తు దేవుడు అని ప్రపంచంలో ఎన్ని దేశాలలో చెప్పినప్పటికీ, ఏసుక్రీస్తు శరీరం విడిచిపెట్టిన తరువాత 300 సంవత్సరాలు ఆయన పేరు చెప్పిన వాళ్ళు లేరు ప్రపంచంలో. 300 సంవత్సరాలు ఏసుక్రీస్తు పేరు ఏ దేశంలోనూ వినబడలేదు అసలు! ఏసుక్రీస్తుని శిలువ వేసినప్పుడు, ఏసుక్రీస్తు ఇలా కష్టపడ్డాడు అని చెప్పకున్నవాళ్ళు కూడా లేరు అప్పుడు. ఏసుక్రీస్తు ఈ మాట చెప్పాడు అని ముచ్చటకైనా చెప్పేవాళ్ళు లేకుండా పోయారు. కానీ తరువాతి కాలంలో ఆయన మాట లోకం అంతా వ్యాపించింది. మీరు నిజం అనుకున్నది, సత్యం అనుకున్నది, ప్రశాంతంగా చెప్పి శరీరం విడిచిపెట్టండి. ఆ మాట లోకం అంతా వ్యాపిస్తుంది. సత్యాన్ని గౌరవించకుండా, సత్యం ఎలా దర్శించగలరు?

మహాత్ములు అందరూ, సమాజం వాళ్ళ పట్ల కొంచెం కూడా కృతజ్ఞత చూపించక పోయినా, వాళ్ళ మనస్సు ఎదురు తిరగలేదు. మనం వాళ్ళ మీద నిప్పుల వర్షం కురిపిస్తే, వాళ్ళు మన మీద ప్రేమ వర్షం కురిపించారు. మనము వాళ్ళకి ద్వేషం ఇస్తే, తిరిగి వాళ్ళు మనకి ప్రేమని ఇచ్చారు. మేము మిమ్మల్ని ద్వేషిస్తూ వుంటే మీరు మమ్మల్ని ప్రేమిస్తున్నారు అన్నాడు ఒక భక్తుడు ఏసుతో. ద్వేషించే వాడిని ద్వేషిస్తే, అందులో విశేషం ఏమీ లేదు. ద్వేషించే వాడిని కూడా ప్రేమిస్తే అది విశేషం.



# అరుణాచల మహత్మ్యం
# అక్షరమణమాల

**నేస్తముండని నాకు నీ యాశ జూపి నన్ను**

**మోసగింపక బ్రోవుము అరుణాచలా!**

**తాత్పర్యం :** ఏ స్నేహాలూ లేని నాకు, నీ మీద ప్రేమ కలిగించావు. ఇప్పుడు నీ ప్రేమ వైకములో నన్ను పెట్టి మోసం చేయక, నీ మొహాన్ని కూడా నాలో కత్తిరించి కాపాడుఅరుణాచలా!

"టీనేజ్ ఇజ్ వరస్ట్ ఏజ్". ఎందుచేతనంటే ఆ వయస్సులో మనకి తెలియదు, పెద్దవాళ్ళు చెపితే బుర్రకి ఎక్కదు. అంటే మనకి యవ్వనం వచ్చే వయస్సు అది. సర్వసాధారణంగా ఏదైతే వరస్ట్ ఏజో, అటువంటి వయస్సులో రమణమహర్షికి జ్ఞానం కలిగింది. రమణస్వామి ఆత్మ సింహాసనానికి అధిపతి అయ్యాడు అంటే, ఆ ఔన్నత్యం, అందులో ఉన్న బ్యూటీని ఒకసారి మీరు చూడండి.

ఓ అరుణాచలేశ్వరుడా, నాకేమీ స్నేహాలు లేవు. నాకేమీ ఆధారాలు లేవు. ఈ లోకంలో నాకు ఇది ఉంది అని చెప్పుకోవటానికి ఏమీ లేదు. అటువంటి స్థితిలో నీమీద నాకు ఆశ చూపించావు అరుణాచలేశ్వరుడా. నా టీనేజ్‌లోనే నిన్ను తెలుసుకోవాలనే కాంక్ష కలిగింది. అది ఎన్ని జన్మలలో చేసిన పుణ్యమో, ఎంతో కృషి చేస్తే, ఆ వయస్సులో ఆయనకి కలిగింది.

మనందరికీ ఆధారాలు ఉన్నాయి కదా. ఏమండీ మీకేమిటి ఆధారం అంటే నాకు ఇండియన్ బ్యాంకులో లక్షాయాభై వేలు ఉన్నాయి అంటాడు.ఇంకొకడు, నాకేమీ పరవాలేదు, నాలుగు ఎకరాల పొలం ఉంది అంటాడు, లేకపోతేమా అబ్బాయిలు నాలుగేసి వేల రూపాయల జీతాలుతెచ్చుకొంటున్నారు, నాకునెలకి వెయ్యి పంపిస్తున్నారు, నాకేమీ పరవాలేదు అంటాడు.ఇలా ప్రతి ఒక్కడి మనస్సు, లోకానికి సంబంధించిన ఏదో ఒక విషయం మీద డిపెండ్ అయ్యి ఉంటుంది.కాని నాకు పరమేశ్వరుడు ఉన్నాడు, భగవంతుడు ఉన్నాడు, అని ఎవరి మనస్సు అయినా భగవంతుడి మీద వాలుతోందా! నాకు ఉన్న బ్యాంకు ఎకౌంటు

నాకు సెక్యూరిటీ అనుకొంటున్నాను కాని, నాకు భగవంతుడే సెక్యూరిటీ అన్న భావన ఎవరికైనా కలుగుతోందా? అది చాలా కష్టం! మనకి డబ్బుమీద ఆశ ఉంటుంది, గౌరవం మీద ఆశ ఉంటుంది, లేకపోతే కీర్తి మీద ఆశ ఉంటుంది, ఏదో గొప్పల మీద, ఏదో పదవులకి వెళ్లాలని ఆశ ఉంటుంది. ఈ లోకానికి సంబంధించిన విషయాలు ఏదో సాధించాలి అని వీటి మీదే ఉంటుంది. లోకానికి సంబంధించిన రోగంతోనే మనం బాధ పడుతున్నాము కాని, ఈశ్వరుడి పట్ల విశ్వాసం కాని, ఈశ్వరుడి పట్ల ఆశ కానీ, మనలో ఎంతమందికి హృదయంలో ఉంది?

ఓ అరుణాచలేశ్వరుడా, నేస్తముండని నాకు, ఏ స్నేహాలు, ఆధారాలు, గౌరవాలు లేనటువంటి నాకు, నీ ఆశ చూపించావు అరుణాచలా! అది బలీయమైనటువంటి ఆకర్షణ, అదొక మహా ప్రవాహం.

నాలో పొగరుబోతు తనం ఉన్నంత కాలం, అహంకారం ఉన్నంత కాలం, భగవంతుడి మీద ఆశ కలగదు.అన్ని దెబ్బలు తగిలాక, ముఖం అటు తిరుగుతుంది కాని, మామూలుగా బాహ్యంగా దెబ్బలు తగలకపోతే, మన ముఖం అటు తిరగదు.దెబ్బలు తిన్నాక, మనం చేసేది ఏమీ లేనప్పుడు, మనని ఎవరూ పలకరించనప్పుడు, ఈ సమాజం మనల్ని వదిలేసినప్పుడు, ఎప్పుడైనా అంటామేమో కృష్ణా రామా అని. అదైనా ఎప్పుడైనా ఏక్సిడెంటలుగా అంటామేమో!

ఓ అరుణాచలేశ్వరుడా, నేస్తముండని నాకు నీ ఆశ చూపి నన్ను మోసగింపక బ్రోవుము అరుణాచలా! ఓ అరుణాచలేశ్వరుడా, ఏ ఆధారాలు, ఏ స్నేహాలు లేని నాకు నీమీద ఆశ కలిగించావు. నేను నిన్ను నమ్మి వచ్చాను, నా కుటుంబాన్ని విడిచిపెట్టాను, నా బంధువులను విడిచిపెట్టాను.నా అనేది అంతా విడిచిపెట్టాను, అన్నీ విడిచిపెట్టి, భయము లేకుండా నీ పాదాల దగ్గరికి వచ్చాను.ఇప్పుడు నన్ను కాదని గెంటివేయకు అరుణాచలా!నన్ను మోసం చేయకుండా, ఈ లోకంతోటి నన్ను కలిసిపోనివ్వకుండా, నాకు జ్ఞానాన్ని ప్రసాదించు. ఈ వ్యక్తీభావనని తీసేయి, ఈ అహంకారాన్ని తీసేయి. అహంకారం పోగొట్టుకోవటం సామాన్యమైన విషయం కాదు.అహంకారమే అజ్ఞానం, అహంకారమే చీకటి, అహంకారమే చిజ్జడగ్రంధి, సమస్తరుగ్మతలు అహంకారం లోనుంచే వస్తున్నాయి. ప్రపంచంలోనిపేచీలకి, ప్రపంచంలో ఉన్న యుద్ధాలకి, అశాంతికి, దుఖాలకి, అంతటికీ ఒకటే కారణం. అది అహంకారం! అటువంటిపరిస్థితులలో, నీ పట్ల బలీయమైన ఆకర్షణ కలగచేసి, నా అహంకారాన్ని తీసేసి, నాకు జ్ఞానాన్ని ప్రసాదించు.ఈ వ్యక్తీ భావనని తీసేయి, ఈ అహంకారాన్ని తీసేయి, అని రమణస్వామి ప్రార్థిస్తున్నాడు.

**అరుణాచలశివ అరుణాచలశివ అరుణాచలశివ అరుణాచలా!**

శ్రీ రమణ క్షేత్రం, జిన్నూరు - సెల్ : 98485 23805

SRI RAMANA KSHETRAM A/c. No. **520101264185724**
**UNION BANK OF INDIA, PALAKOL BRANCH**
IFSC Code : **UBIN0916137, Contact No. 9866715896**

# భగవాన్ శ్రీరమణమహర్షి

భగవాన్ శ్రీరమణమహర్షి 141వ జయంతి ది॥ 31-12-2020న జరుపుకోబోతున్నాం. పరమగురువు, విముక్తి ప్రదాత, ఆధునిక మహర్షి అయిన శ్రీరమణుని జయంతి మనందరికి మహత్తరమైన రోజు. తన 17వ ఏట, మధురైలో అమృతానుభవమును పొందిన తరువాత, సెప్టెంబరు 1, 1896న ఆ ఉపాధిని ఈశ్వరుడు అరుణాచల క్షేత్రానికి చేర్చాడు. తరువాత ఏబదినాలుగు సంవత్సరములు జీవన్ముక్తునిగా తాను అరుణాచల క్షేత్రములో సంచరించిన కాలములో, దేశ విదేశముల నుండి అనేక మంది ముముక్షువులు వారి బోధపట్ల ఆకర్షితులయ్యారు. భగవాన్ శ్రీరమణుడు, ఆధ్యాత్మిక అయస్కాంతం. భగవాన్ శ్రీరమణుని అవతార ప్రయోజనం ఒక్కటే! అది ఏమనగా "మనం వెదుకుతున్న సత్యము, మనోమూలంలో మన స్వరూపంగానే ఉంది. కానీ మనము దాని గురించి, బాహ్యములోనూ, శాస్త్రాలలోనూ వెదుకుతున్నాము. బాహ్యములో వెదికే మనస్సుకు, అంతరదృష్టిని కలిగించి, మనస్సును దాని మూలములోనికి ఉపసంహరించి, అక్కడ దానిని నశింప చెయ్యాలి. మనస్సు దాని మూలములో నశిస్తే, బ్రహ్మము 'నేను'గా, 'తాను'గా అనుభవైకవేద్యం అవుతుంది". సృష్టిలో ప్రతి మానవునికి మనస్సు ఉంటుంది, 'మనోనాశం' గమ్యము కాబట్టి! తన బోధ ద్వారా, జీవిత విధానము ద్వారా, వాస్తవముగా మన స్వరూపం ఏమిటో? తెలియజెప్పి, స్వస్థితిలోకి మేలుకొలుపుటకు వచ్చిన సద్గురు రూపం! తాను 17వ ఏట అమృతుడై, మానవాళిని అక్కడకు మేల్కొలుపుటకు జ్ఞానబోధ చేసారు. మౌనం ద్వారా మాట్లాడడంలో మహానేర్పరి భగవాన్. ఒక చెట్టు తన స్వభావ రీత్యా అందరికీ నీడను, ఫలాలను ఇస్తుంది. అంతే కానీ ఫలానావారు నాకు మిత్రులు, ఫలానా వారు నాకు శత్రువులు అనుకోదు. అట్లే భగవాన్ తాను శరీరధారియై ఉన్న కాలము లోనూ, అదేవిధముగా నేటికీ, తనను ఆశ్రయించిన వారికి పరమశాంతిని, అనుగ్రహాన్ని ప్రసాదిస్తూనే ఉన్నారు. భగవాన్ శ్రీరమణుని గౌరవించడం అంటే, ఆయన సూచించిన మార్గములో పయనిస్తూ, ఆయన బోధను ఆచరిస్తూ, ఆయన జీవించినట్లు నిరాడంబరముగా, అహంకార రహితముగా, సమబుద్ధితో జీవించాలి. రమణమార్గములో అహంకార నివారణోపాయమే సాధన. నిస్వార్థంగా, అహంకార రహితంగా, నిరాడంబరముగా, జీవించి మానవాళిని అంతిమ సత్యములోనికి మేల్కొలుపుటయే గమ్యముగా, ఈ భూమి మీద అవతరించిన మహాత్ముల జన్మదినాన్ని జరుపుకోవడం ద్వారా మనము పవిత్రులం అవుతాం.

**ఓం తత్ సత్**

**(ది॥ 31-12-2020 శ్రీరమణ జయంతి సందర్భముగా)**

**- చావలి సూర్యనారాయణమూర్తి, అమలాపురం, సెల్ : 9963195064**

# పరమయోగి కబీర్ 'గురు వైభవం' గురించి చెప్పిన తీరు

కబీర్ ఒక బ్రాహ్మణ వితంతువుకు జన్మించాడు. బిడ్డను చెరువు గట్టుపైన వదిలి కనబడకుండా వెళ్లిపోయింది. ఒక ముస్లిం పెంచి కబీర్ అని నామకరణం చేసాడు. సద్గురువు నామాన్ని నిరాకరించగా ఆయన గంగా స్నానానికి వెడుతూ చీకటిలో మెట్లపై పడుకుని ఉన్న కబీర్ చేయిమీద కాలు వేయగా "శ్రీరామ రామ" అనగా దాన్ని మంత్రంగా ఉపాసించి పరమయోగి కబీర్‌గా లోక ప్రసిద్ధి చెందాడు. గురువైభవం చెప్పటంలో వారికి వారే సాటిగా భక్తులు కొనియాడుతారు. ఆ పలుకులు ఇవి "గురు రూప ధ్యానం గొప్పది. భూమినంతటిని కాగితంలా చేసి అడవులన్నింటిని కలంగా చేసి సప్త సముద్రాలు సిరాగా వ్రాసినప్పటికీ గురుగుణాలను వర్ణించలేము. సద్గురువు సత్యాసత్యాల భేదాన్ని చెప్పేవాడు. అది తెలుసుకున్న శిష్యుడే ధన్యుడు అతని భాగ్యమే భాగ్యము. ఈ ప్రపంచంలో వైవిధ్యాన్ని చూడటం కోసమే ఈ ప్రపంచంలోకి వచ్చాము. గురుకృప వల్ల అనుపమానమైన బ్రహ్మయొక్క దర్శనం అందదని శిష్యుడు భావిస్తాడు. నిజమైన గురువు సాంగత్యంతో నీ మనస్సును జోడించు అప్పడే చంచలత్వం దూరమై నిశ్చలత్వం పొందుతాము. జనన మరణాల చక్రం నుంచి విడుదల పొందుతాము. గురువు వారణాసిలో ఉన్నప్పటికీ శిష్యుడు సముద్రతీరంలో ఉన్నా శిష్యుని శరీరంలో గురువు యొక్క గుణాలు వుంటే ఒక్కక్షణం కూడా ఎడబాటు ఉండదు. కర్తృత్వ భావన ఎప్పడైతే మరణించిందో కర్మ లేకుండా పోతుంది. అహంకారం, గౌరవం, స్త్రీ వ్యామోహం అనేవి మరణిస్తాయి. అప్పడు ఆత్మారాముణ్ణి తెలుసుకొని అమరులు అవుతారు. మనం శరీరమనే యంత్రంపట్ల ముగ్ధులై ఉన్నాము. జీవితం అంతా అజ్ఞాననిద్రలోనే గడిపేస్తున్నాము. కొంచెం తెలివితెచ్చుకొని దేవాలయాల ప్రతిమలను మొక్కుతాము. తీర్థయాత్రలకు వెళ్లి పవిత్రమైపోయామని మురిసిపోతాము. దానివల్ల పరగతి ప్రాప్తించదు. సద్గురు ఒక్కడే ఈ ప్రపంచానికి భరోసా ఇచ్చేవాడు అని తెలుసుకోగలిగాము. ఎప్పడైతే నీ హృదయంలో జ్ఞాన ప్రకాశం ఉదయిస్తుందో భ్రమల భాండాగారం నశిస్తుందో ఆ అపూర్వ జ్ఞానం ప్రాప్తిస్తుందో అప్పడే గురువు లభించిన విషయం గ్రహిస్తావు. గురువుకు జాతి, ప్రాంతాల భేదభావాన్ని చూడడు. అతడు భక్తుని యొక్క సంసారిక బంధనాలను భగ్నం చేస్తాడు. ఏవిధంగానైతే సెలయేళ్ళు నదులలో కలిసి సాగరంలో కలిసి విడదీయనట్లు అయిపోతుందో అదేవిధంగా గురు సంపర్కం వల్ల మలినత్వాన్ని పోగొట్టుకొని పరిధులు లేని వాడిగా అయిపోతాడు. శాశ్వతత్వం అంతటా పరమాత్మ దర్శనం కలుగుతుంది. గురు కృప వల్ల మతి వికలమైపోయి పిచ్చిదైపోయింది. మూడు గుణాలు నాశనమైపోయాయి. దేహం విదేహమైపోయింది. గురువు మన తనువు మనసులో ఉండే తాపాన్ని పోగొడతాడు. సుఖదుఃఖాలకు అతీతమైన స్థితిని పొందుతాము. నీకు నువ్వుగా గురు రూపంలో ప్రకటితమౌతావు అంటారు సద్గురువులు.

**- సాగిరాజు రామకృష్ణంరాజు, అర్ధవరం, సెల్ : 9491968966**